ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

బాపట్ల జిల్లా వార్తలు

5 బుధవారం 17 జులై 2024





బదిలీలు



ఉన్నట్టా.. లేనట్టా..

- అయోమయంలో ప్రభుత్వ యంత్రాంగం
- కుంటుపడుతున్న పాలన
- పరిష్కారానికి నోచుకోని ప్రజా సమస్యలు
- మాకెందుకులే అన్న రీతిలో అధికారుల తీరు
- కోరుకున్న చోటకు బదిలీ కోసం అధికారుల యత్నం
- భారీగా లేఖలు జారీ చేసిన ప్రజా ప్రతినిధులు

అధికారులందరినీ బదిలీ చేస్తారనే ప్రచారం ఉద్యోగ వర్గాల్లో ఉంది. ఇదే అభిప్రాయాన్ని కొత్త ప్రభుత్వం వ్యక్తం చేస్తూ వస్తోంది. దీంతో పాలనాపరమైన నిర్ణయాలు తీసుకోవడానికి అధికారులు ఆసక్తి చూపడం లేదు. ఉంటామో వెళతామో అనే అంశంపై స్పష్టత రాకపోవడంతో, చాలా ఫైళ్ల వైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. దీంతో పెండింగ్ సమస్యల విషయంలో పాత ప్రభుత్వంలో ఎదురైన అనుభవమే అక్కడక్కడా ప్రజలకు ఎదురవుతోంది. దీంతో జిల్లా అధికారుల బదిలీలపై ప్రభుత్వం త్వరితగతిన నిర్ణయం తీసుకుంటే పాలన పూర్తి స్థాయిలో గాడిన పడే అవకాశం ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వ కార్యాలయాల్లో బదిలీలపైనే చర్చ సాగుతోంది. బదిలీలు ఉంటాయా.. ఉండవా అన్న సందేహాలు ప్రభుత్వ యంత్రాంగంలో నెలకొంది. కూటమి ప్రభుత్వం బదిలీలపై ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. దీంతో పాలన కుంటుపడుతోంది. ప్రజా సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. కార్యాలయాల చుట్టూ ప్రజలు ప్రదక్షిణలు చేస్తున్నారు. ఉంటామో బదిలీపై వెళతామో మాకెందుకులే అన్న రీతిలో ప్రజల సమస్యల పట్ల అధికార యంత్రాంగం వ్యవహరిస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడే పరిస్థితి ఉంది. చేపట్టిన ప్రగతి పనులను అధికారులు ముందుకు తీసుకు పోవడంలేదు. కోరుకున్న చోటకు బదిలీ కోసం అధికార యంత్రాంగం ఎవరి ప్రయత్నాల్లో వారు ఉన్నారు. ఇప్పటికే బదిలీల కోసం ప్రజా ప్రతినిధులకు అధికారులు లేఖలు అంద చేశారు. సచివాలయంలో మంగళవారం జరిగిన మంత్రి వర్గ సమావేశంలో కూడా బదిలీలపై స్పష్టత ఇవ్వలేదు. దీంతో బదిలీల ప్రక్రియ తీవ్ర జాప్యం జరుగుతుందన్న వాదన అధికార యంత్రాంగం నుంచి వినిపిస్తోంది.

పంచాయతీ కార్యదర్శి నుంచి ఎంపీడీవో.. కానిస్టేబుల్ నుంచి డీఎస్పీ.. వీఆర్వో నుంచి ఆర్డీవో వరకు బదిలీల ఉత్తర్వుల కోసం ఎదురు చూస్తున్నారు. ఇదే పరిస్థితి జిల్లా స్థాయి అధికారుల్లో కూడా నెలకొంది. తెలుగుదేశం కూటమి అధికారంలోకి రావడంతో బదిలీలు ఉంటాయన్న సమాచారంతో అధికారులు వారి విధులు పూర్తి స్థాయిలో నిర్వహించకుండా మిన్నకుంటున్నారన్న విమర్శలున్నాయి. కోరుకున్న చోటకు బదిలీ అయ్యేలా ఎవరి ప్రయత్నాల్లో వారు నిమగ్నమయ్యారు. ఇందుకోసం ప్రజా ప్రతినిధుల ఇళ్లకు క్యూ కడుతున్నారు. బదిలీలకు ఎమ్మెల్యేల లేఖ తప్పని సరి అన్న ప్రచారం జరుగుతోంది. దీంతో వారి లేఖలు పొందేందుకు అధికారులు లాబీయింగ్ చేసుకుంటున్నారు. ఇప్పటికే పెద్ద ఎత్తున కొందరు ఎమ్మెల్యేలు బదిలీల సిఫార్సు లేఖలు జారీ చేశారు. వైసీపీతో అంటకాగిన అధికారులు విధుల్లో ఉండటంతో ప్రజా ప్రతినిధులు సిఫార్సు చేస్తున్న పనులు జరగకపోతుండటంతో వారు కూడా తీవ్ర అసంతృప్తి చేస్తున్నారు. మునిసిపాలిటీలలో పరిస్థితి దారుణంగా ఉంది. మురుగు నీటి సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. అధికారులు కార్యాలయాలకే పరిమితం అవుతున్నారు. రెవెన్యూ శాఖలో రైతుల భూ సమస్యలు పరిష్కారం కావడం లేదు. ఎన్నికల ముందు ఉమ్మడి గుంటూరు జిల్లాలోని తహసీల్దార్‌లను పూర్తిగా బదిలీ చేశారు. తిరిగి అదే స్థాయిలో తహసీల్దార్ల బదిలీలు జరిగే అవకాశం ఉంది. దీంతో రెవెన్యూ శాఖలో ప్రజా సమస్యలు పరిష్కారానికి నోచుకోవడంలేదు. దీంతో గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై సదరు అధికారులు దృష్టి సారించడం లేదు. ఇక ఇంజనీర్లు అయితే ప్రగతి పనుల విషయంలో మిన్నకుంటున్నారు. ఇదే పరిస్థితి అన్ని శాఖల్లో నెలకొంది. పోలీసు శాఖలో కూడా బదిలీలు భారీగానే ఉంటాయన్న ప్రచారం నేపథ్యంలో సదరు అధికారులు శాంతి భద్రతల విషయంలో పట్టీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. వైసీపీతో అంటకాగిన వారు పోలీసు శాఖలో ఎక్కువగానే ఉన్నారు. వీరందరిని బదిలీ చేయాలని కూటమి శ్రేణులు ఎమ్మెల్యేలపై వత్తిడి తెస్తున్నాయి. మొత్తం మీద బదిలీల ప్రక్రియపై ప్రభుత్వం నిర్ణయం తీసుకునే వరకు ప్రజల సమస్యలు పరిష్కారం కావనే చెప్పాలి. బదిలీలపై ప్రభుత్వ స్పష్టత కోసం ప్రజా ప్రతినిధులు.. అధికార యంత్రాంగం బాధిత ప్రజలు ఎదురు చూస్తున్నారు. బదిలీలపై త్వరతగతిన ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలన్న అభిప్రాయం ప్రజల నుంచి వ్యక్తమవుతోంది.

- వైసీపీ నేతల చేతిలోనే యంత్ర పరికరాలు
- గ్రూపుల ఎంపికలో గతంలో ఇష్టారాజ్యం
- క్షేత్రస్థాయిలో యూనిట్ల పరిస్థితిపై ఆరా
- నివేదిక రూపకల్పనలో నిమగ్నమయిన యంత్రాంగం

రాయితీ ఎవరికిచ్చారు!

రాయితీ యంత్రాలను రైతులకు అందించే విషయంలో దాదాపు మూడేళ్ల పాటు మాటలతోనే సరిపెట్టిన వైసీపీ ప్రభుత్వం చివరి రెండేళ్లు మాత్రం హడావిడి చేసింది. రైతులకు వ్యక్తిగతంగా సాగు పనిముట్లు అందించే అంతకు మందు ప్రభుత్వ విధానాన్ని కాలదన్ని కమ్యూనిటీ హైరింగ్ సెంటర్ల పేరిట గ్రూపుల విధానాన్ని ప్రవేశపెట్టింది. దీనిలో కూడా అనేక పిల్లిమొగ్గలు వేసిన అనంతరం ఆచరణలోకి తెచ్చింది. ఇక్కడా రాజకీయమే ప్రధానంగా నడుపుతూ అర్హులైన రైతుల నోట్లో మట్టి కొట్టి వైసీపీ నేతాగణం అనుచరులకే లబ్ధి చేకూర్చే విధంగా గ్రూపులను ఎంపిక చేసి రాయితీ యంత్రాల ఉద్దేశ్యాన్నే నీరుగార్చిందనే విమర్శలు ఉన్నాయి. మంజూరు చేసిన యూనిట్లలో దాదాపు 50 శాతం గ్రూపులు అసలు రైతులే కారని వారంతా వేర్వేరు రంగాల్లో స్థిర పడినప్పటికీ వైసీపీ నేతల సిఫారసుతో లబ్ధి పొందారనే ఆరోపణను గతంలో టీడీపీ చేసింది. పలు గ్రామాల్లో రైతులు కూడా ఇదే అంశంపై ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం కొత్త ప్రభుత్వం కొలువుదీరడంతో ఈ రాయితీ యంత్రాల యూనిట్ల బాగోతంలో జరిగిన అవకతవకలపై కదలిక వచ్చింది. ఎన్ని గ్రూపులకు పరికరాలు ఇచ్చారు, ప్రస్తుతం ఆ పరికరాలు నిబంధనల ప్రకారం రైతుసేవా కేంద్రాలలోనే ఉన్నాయా అనే అంశంతోపాటు లబ్ధిదారుల జాబితాను కూడా పంపాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ నుంచి మౌఖిక ఆదేశాలు ఇప్పటికే జిల్లా అధికారులకు అందాయి.

బాపట్ల, జులై16(ఆంధ్రజ్యోతి): 2014--19 మధ్య అప్పటి టీడీపీ ప్రభుత్వం రైతులకు కావాల్సిన సాగు పనిముట్లను రాయితీపై వ్యక్తిగతంగా అందించేది. అందుకు సంబంధించిన విధివిధానాలపై కూడా పూర్తి స్థాయిలో స్పష్టత ఉండడంతో రైతులకు పెద్ద ఎత్తున మేలు జరిగేది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తొలి మూడేళ్లు పూర్తిగా రాయితీ యంత్ర పరికరాలు అందించే విధానానికి స్వస్తి పలికింది. చివరి రెండేళ్లలో మాత్రం కమ్యూనిటీ హైరింగ్ సెంటర్ (సీహెచ్‌సీ)ల పేరిట రైతులను గ్రూపులుగా ఏర్పాటు చేసి రాయితీ పరికరాలను అందించి వాటిని రైతుసేవా కేంద్రాలు (అప్పట్లో రైతుభరోసా)లో ఉంచి నామమాత్రపు అద్దె ప్రాతిపదికన రైతులకు అందించాలని నిర్ణయించింది. ప్రకటన అయితే ఇచ్చింది తప్ప మార్గదర్శకాల విషయంలో పలుమార్లు పిల్లిమొగ్గలను వైసీపీ ప్రభుత్వం వేసింది. రైతులకు అత్యంత అవసరమైన ట్రాక్టరును రాయితీ నుంచి మినహాయించడంతో అవాక్కవడం రైతుల వంతయింది. తర్వాత దానిని చేర్చింది. దీంతో పాటు యంత్రాలు అందించే కంపెనీల వారికి బిల్లులు పెండింగ్ పెట్టడంతో యంత్రాల సరఫరాకు వారు సైతం ఆసక్తి చూపలేదు. ఇలా అనేక బాలారిష్టాలను దాటి ఇచ్చిన అరకొర యూనిట్లు సైతం వైసీపీ వారికి ఇచ్చి మమ అనిపించిన ఘనత వైసీపీది.

దేనిపైనా స్పష్టత లేకుండా..

రాయితీ యంత్రాలను రైతులకు అందించే విషయంలో దేనిపైనా స్పష్టత లేకుండా వైసీపీ ప్రభుత్వం వ్యవహరించడంతో ఐదేళ్ల పాటు అన్నదాతలు ఎన్నో అగచాట్లు పడ్డారు. ఆయా గ్రూపుల ద్వారా రాయితీ యంత్రాలు పొందిన వారు వాటిని రైతు సేవా కేంద్రాలలో ఉంచితే అక్కడ నుంచి అద్దె ప్రాతిపదికన కావాల్సిన రైతులు తీసుకెళతారని ప్రభుత్వం చెప్పింది. కానీ అద్దెఎంత, పర్యవేక్షించేదెవరు అనే అంశంలో అంతా గందరగోళమే తప్ప స్పష్టత కొరవడింది.

వైసీపీ నేతల ఇళ్ల వద్దే...

ఆదేశాలలో మాత్రమే పరికరాలను రైతు సేవా కేంద్రాలలో ఉంచాలని చెప్పేవారు. కానీ ఆచరణలో మాత్రం ఆ పరికరాలన్నీ కూడా వైసీపీ నేతల ఇళ్ల వద్దే ఉండేవి. హక్కుగా వాటి ప్రయోజనాలను పొందాల్సిన రైతులు అలా కాకుండా వైసీపీ నేతల ఇళ్ల ముందు పడిగాపులు పడే విధంగా చేశారు. ఇక అద్దె విషయంలో కూడా ఇష్టారీతిన వ్యవహరిస్తున్నా అడిగే వారే కరువయ్యారు. పక్షపాత ధోరణితో ఈ వ్యవహారం నడిచేది. వైసీపీతో అంటకాగితే ఒకలా, లేకుంటే మరోలా ఈ అద్దె ఉండేది. టీడీపీ సానుభూతి పరులుగా ముద్ర ఉన్న రైతుల విషయంలో అయితే ఈ అద్దెను అమాంతం రెండు మూడు రెట్లు పెంచి నిలువునా దోచేశారు. దేనికీ లెక్కాపత్రం ఉండేదికాదు, పర్యవేక్షించే వ్యవస్థలు కూడా లేకపోవడంతో రాయితీ యంత్రాలు కాస్తా రాజకీయ యంత్రాలుగా మార్చి ఇష్టారీతిన వైసీపీ నేతలు దోచేశారు



సమగ్ర విచారణ దిశగా...

రాయితీ యంత్రాల విషయంలో సమగ్ర విచారణ చేసే దిశగా యంత్రాంగం అడుగులేస్తోంది. ముందుగా జిల్లాల్లో జారీ చేసిన యూనిట్లలో సభ్యులుగా ఉన్నవారెవరు అనే అంశంపై పూర్తి స్థాయిలో దృష్టిసారించారు. వీరంతా అసలు రైతులా.. కాదా అనే దానిపైనే తొలుత విచారణ జరగనుంది. గ్రూపు సభ్యులు అందుకున్న పరికరాలు ఇళ్ల వద్ద కాకుండా రైతు సేవా కేంద్రాలలో ఉంచాలనేది నిబంధన. అలా కాకుండా సొంత ఆస్తిలాగా ఇన్నిరోజులూ ఇళ్ల వద్దనే ఉంచుకుని రైతులను ఇక్కట్లకు గురిచేశారు. ప్రభుత్వం వైపు నుంచి విచారణ చేసే దిశగా కదలిక రావడంతో పరికరాలను ఆయా కేంద్రాల వద్ద ఉంచి వెళుతున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా పరికరాలు సభ్యులకు అందిన దగ్గర నుంచి నామమాత్రపు అద్దె ప్రాతిపదికన ఎంతమందికి ఇచ్చారు, ఎంతమంది రైతులకు లబ్ధి చేకూర్చారు అనే వాటిపై కూడా పూర్తి విచారణ చేసి నివేదిక సమర్పించే దిశగా అధికారులు కసరత్తు చేస్తున్నారు

కొన్ని యంత్రాలు అసలు లేవని...

ఒక్కో గ్రూపునకు 5 నుంచి 15 లక్షల విలువైన యంత్రపరికరాలను అందించారు. యంత్రాల కోసం గ్రూపులకు అందించే రుణాలలో 50 శాతం బ్యాంకు రుణం కాగా, 40 శాతం వాటాను ప్రభుత్వం సబ్సిడీ రూపంలోనూ, మిగిలినది ఆయా గ్రూపు సభ్యులే భరించాల్సి ఉంటుంది. వీటిని గ్రామంలోని రైతుల అవసరాల కోసం అద్దె ప్రాతిపదికన అందించాలే కానీ ఇతరత్రా చేయకూడదు. క్షేత్రస్థాయిలో పరిశీలనకు వెళ్లిన అధికారులకు విస్తుపోయే అంశాలు అనుభవంలోకి వస్తున్నాయి. ఆయా గ్రూపు సభ్యుల జాడ కనిపించడంలేదు. దీంతో ఏదో మొక్కుబడిగా పేర్లు చేర్చి ఆ సబ్సిడీని వైసీపీ నేతలే కొట్టేశారా అనే అనుమానం కూడా కలుగుతోంది. ఇక పరికరాలు కూడా అన్నీ కనిపించడం లేదని, దాదాపు ప్రతి గ్రూపులో ఒకట్రెండు యంత్రాలు మిస్సింగ్ కనబడుతున్నాయని వాటినేమన్నా బయటి వ్యక్తులకు అమ్మారా అనే కోణంలో కూడా విచారణ చేస్తున్నామని అధికారులు చెబుతున్నారు. అర్హులు కాకుండా లబ్ధి పొందిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవాలనేది ప్రభుత్వ నిర్ణయం ప్రకారం ముందుకెళతామని యంత్రాంగం చెబుతోంది.

సగం యూనిట్లు వైసీపీ వారి చేతిలోనే..

బాపట్ల జిల్లాలో మొత్తం 410 రైతు సేవా కేంద్రాలుండగా రాయితీ యంత్రాలను దఫాల వారీగా అందించింది 270 కేంద్రాలలో మాత్రమే. ఇందులో కూడా అన్నదాతలకు అవసరమైన ట్రాక్టరును మినహాయించి ఇచ్చిన యూనిట్లే ఎక్కువ. 270 యూనిట్లలో దాదాపు 120కు పైగా వైసీపీ నేతల అనుచరుల చేతిలోనే ఉన్నట్లు సమాచారం. అదే విధంగా గుంటూరు జిల్లాలో మొత్తం 249 కేంద్రాలుండగా దాదాపు 205 కేంద్రాల్లో యూనిట్లు ఉంచినట్లు గతంలో వ్యవసాయశాఖ తెలిపింది. ఇందులో 50 శాతం వైసీపీకి కొమ్ముకాసిన వారే లబ్దిదారులుగా ఉన్నారు. పల్నాడు జిల్లాలో 421 రైతు సేవా కేంద్రాలు ఉండగా 290 సెంటర్లలో రాయితీ యంత్రాలు ఉంచారు. ఇక్కడ కూడా చాలా చోట్ల ట్రాక్టరు లేకుండానే మమ అనిపించగా సగం కేంద్రాలలో అసలు రైతులే లబ్ధిదారులుగా లేరని తెలుస్తోంది.

ప్రాధాన్యత రంగాలకు అధిక రుణాలివ్వాలి

- బ్యాంకర్ల సమావేశంలో కలెక్టర్ వెంకటమురళీ

బాపట్ల, జులై 16 : ప్రాధాన్యత రంగాలకు బ్యాంకర్లు అధిక రుణాలివ్వాలని కలెక్టర్ జే వెంకటమురళీ కోరారు. జిల్లా స్థాయి బ్యాంకర్ల సమీక్షా సమావేశం మంగళవారం కలెక్టరేట్‌లో జరిగింది. 2024-2025 ఆర్థిక సంవత్సరానికి రూపొందించిన వార్షిక ప్రణాళికను కలెక్టర్ ఆమోదించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయంపై ఆధారపడిన బాపట్ల జిల్లాలోని రైతులకు అధిక ప్రాధాన్యతనిచ్చి వ్యవసాయ రుణాలివ్వాలన్నారు. ప్రాధాన్యత, ప్రాధాన్యతలేని రంగాలకు కలిపి మొత్తంగా ఈ ఆర్థిక సంవత్సరంలో 13,443.60 కోట్ల రూపాయలు రుణాలివ్వాలని రూపొందించిన ప్రణాళికను ఆమోదిస్తున్నట్లు కలెక్టర్, కమిటీ ఛైర్మన్ వెంకటమురళీ ప్రకటించారు. ప్రణాళికలో ప్రాధాన్య రంగాలకు 11,719 కోట్ల రూపాయలు రుణాలివ్వాలని చెప్పారు. ప్రాధాన్యం లేని రంగాలకు 1,724 కోట్ల రూపాయలు ఇవ్వాలని వివరించారు. వ్యవసాయానికి 10,053 కోట్లరూపాయల రుణాలు ఇవ్వాలన్నారు. సూక్ష్మ,చిన్న, మధ్య తరహ పరిశ్రమల స్థాపనకు 1,153.33 కోట్ల రూపాయలు కేటాయించాలన్నారు. విద్యా రుణాలు, గృహనిర్మాణాలు, విద్యుదీకరణ, సామాజిక అవసరాలు తదితర ప్రాధాన్య రంగాలకు 512 కోట్ల రూపాయలు ఇవ్వాలన్నారు. వార్షిక ప్రణాళికను తక్షణమే అమలులోకి తీసుకురావాలని కలెక్టర్ సూచించారు.

- బాపట్ల జిల్లా ఏర్పడినప్పటి నుంచి 20,272 కోట్ల రూపాయలు రుణాలు అందించినట్లు కలెక్టర్ చెప్పారు. అందులో వ్యవసాయ రంగానికి 12,792 కోట్లు కాగా పరిశ్రమలకు 1,611 కోట్లు, ఇతరప్రాధాన్యత రంగాలకు 921కోట్లు, ప్రాధాన్యత లేని రంగాలకు 4,947 కోట్ల రూపాయలు రుణాలిచ్చినట్లు వివరించారు. బాపట్లజిల్లాలో 28 బ్యాంక్‌లు పనిచేస్తున్నాయన్నారు. ప్రధానంగా సీసీఆర్‌సీకార్డులు జారీ చేసి రుణసదుపాయం కల్పించాలన్నారు. యాంత్రిక పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహం ఇవ్వాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకటమురళీ

- ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం గడిచిన ఆర్థిక సంవత్సరంలో 10,743 కోట్ల రూపాయలు రుణం ఇవ్వాలని లక్ష్యం కాగా 12,792 కోట్ల రూపాయల రుణాలు పంపిణి జరిగిందని కలెక్టర్ అన్నారు. గత ఏడాది లక్ష్యాలకు మించి రుణాలివ్వటంపై అభినందించారు. లక్ష్యాలను చేరుకోవటంతోపాటు నిర్దేశించి అన్నిరంగాలకు రుణాలు 100శాతం చేరాలని స్పష్టం చేశారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకానికి అవసరమైన నగదు ముందుగా సిద్ధం చేసుకోవాలని బ్యాంక్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఎస్సీఎస్టీలు అధికంగా ఉన్నందున సామాజికవర్గాలకు లక్ష్యం మేరకు రుణాలు చేరేవిధంగా చూడాలన్నారు. ఫిక్స్‌డ్ డిపాజిట్‌లు అధికంగా ఉన్నాయని వాటిని గుర్తించి సదరు ఖాతాదారులకు వాటిని చెల్లించాలన్నారు.

వ్యవసాయ రంగానికి ప్రాధాన్యమివ్వాలి

: ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

వ్యవసాయ రంగానికి బ్యాంకర్లు అధిక ప్రాధాన్యమివ్వాలని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ కోరారు. బ్యాంకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వ్యవసాయాన్ని పోత్సహిస్తూ బ్యాంక్ అధికారులంతా సహకరించాలన్నారు. ముఖ్యంగా ఎస్సీఎస్టీ సామాజిక అభివృద్ధికి రుణసదుపాయం కల్పించాలన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ బీ సుబ్బారావు, లీడ్ బ్యాంక్ కన్వీనర్ మాధురి, లీడ్‌బ్యాంక్ మేనేజర్ శివకృష్ణ, నాబార్డు డీడీఎమ్ రవికుమార్, ఆర్‌బీఐ నవీన్, వివిధ బ్యాంక్‌ల అధికారులు పాల్గొన్నారు.

ప్రజలు, పోలీసుల సహకారం మరవలేం

ఎస్పీ వకుల్ జిందాల్

బాపట్ల,జులై 16 : జిల్లా ప్రజలు, పోలీసు యంత్రాంగం అందించిన సహకారం మరువలేమని ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. బాపట్ల జిల్లా కేంద్రం ఏర్పడిన తర్వాత ఎస్పీగా మొట్టమొదటిగా బాధ్యతలు చేపట్టిన వకుల్ జిందాల్ 2 సంవత్సరాల 4 నెలలు సేవలందించి ప్రజల మన్ననలను పొంది బదిలీపై విజయనగరం జిల్లా వెళుతున్న ఆయనకు వీడ్కోలు సభ నిర్వహించారు. కార్యక్రమంలో వివిధశాఖల అధికారులు, పట్టణ ప్రముఖులు ఎస్పీ వకుల్ జిందాల్‌ను ఘనంగా సత్కరించి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో చేపట్టిన ప్రతి కార్యక్రమానికి పోలీసు అధికారులు, సిబ్బంది అందించిన సహకారం అభినందనీయమన్నారు. బదిలీలలో భాగంగా విజయనగరం వెళుతున్నప్పటికి ఇక్కడ సేవలను ఎన్నడూ మరువలేనన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో, నేరాల నియంత్రణలో, క్లిష్టమైన బందోబస్తు నిర్వహించటంలో పోలీసు అధికారులు, సిబ్బంది కృషి అభినందనీయమన్నారు. జిల్లాలో పోలీసు శాఖకు కావాల్సిన ఆర్మ్‌డ్ రిజర్వు కార్యాలయాన్ని, పెరేడ్ గ్రౌండ్, సీసీఎస్ పోలీసుస్టేషన్, డాగ్‌కెన్నల్‌లను ఇక్కడ ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. ఎన్నికల విధులు, రోడ్డుప్రమాదాల నియంత్రణ, తీరంలో పర్యాటకుల రక్షణ నిమిత్తం గజఈతగాళ్ళను ఏర్పాటు చేయటం, నాటుసారా, గంజాయి నియంత్రణకు చేపట్టిన వినూత్న కార్యక్రమాలు ప్రతి ఒక్కరి కృషి వల్ల సాధ్యమైందన్నారు. దీనికి హోమ్‌గార్డు స్థాయి నుంచి అడిషనల్ ఎస్పీ వరకు ప్రతిఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. బదిలీలు సర్వసాధారణమని అందరినీ వదిలి వెళ్ళటం బాధగా ఉందని బావోద్వేగానికి లోనయ్యారు.

- పోలీసు పేరెడ్ గ్రౌండ్‌లో మంగళవారం ఎస్పీ వకుల్ జిందాల్‌కు ఘనంగా వీడ్కోలు పలికారు. ముందుగా ఎస్పీ పేరెడ్ కమాండర్‌గా వ్యవహరించిన మౌలుద్దీన్ నుంచి గౌరవవందనం స్వీకరించి ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో పేరెడ్ పరిశీలన చేశారు. అనంతరం ప్లటూన్‌ల వారిగా సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. తదుపరి పోలీసు అధికారులు ఎస్పీ వకుల్ జిందాల్‌ను ఘనంగా సత్కరించి సన్మానించారు. అనంతరం ఎస్పీ వకుల్ జిందాల్‌ను పోలీసు అధికారులు భుజాలపై ఎత్తుకొని ప్రదర్శించిన తీరు విశేషంగా ఆకట్టుకుంది. ఈ విధంగా పోలీసు సిబ్బంది తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో పల్నాడు ఎస్పీ మాలికాగార్గ్, అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్, ఏఆర్ డీఎస్పీ ఎస్.చంద్రమోహన్, బాపట్ల డీఎస్పీ సీహెచ్ మురళీకృష్ణ, చీరాల డీఎస్పీ పి.జగదీష్‌నాయక్, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఎస్పీలు వకుల్ జిందాల్, మాలికా గార్గ్‌ను సత్కరించి మెమొంటో అందజేస్తున్న అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న రామచంద్రారెడ్డి

వ్యవసాయ కళాశాలకు అంతర్జాతీయ ఖ్యాతి

- రాజమండ్రి ఐటీసీ లిమిటెడ్ సీనియర్ లీడ్ సైంటిస్ట్, కళాశాల పూర్వ విద్యార్థి డాక్టర్ జి.ఎస్.రామచంద్రారెడ్డి
- ఘనంగా బాపట్ల వ్యవసాయ కళాశాల వ్యవస్థాపక దినోత్సవం

7లో..

దిక్సూచి

గుంటూరు-లాంలోని ఆచార్య ఎన్.జీ.రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ(ఏఎన్‌జీఆర్ఏయూ)- 'అగ్రిసెట్ 2024' నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీనిని వ్యవసాయ విభాగాల్లో పాలిటెక్నిక్ డిప్లొమా పూర్తిచేసిన అభ్యర్థులకు ఉద్దేశించారు. ఈ ఎగ్జామ్‌లో సాధించిన స్కోర్ ద్వారా నాలుగేళ్ల వ్యవధి గల 'బీఎస్సీ(ఆనర్స్) అగ్రికల్చర్ ప్రోగ్రామ్‌లో అడ్మిషన్స్ ఇస్తారు. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

ఎన్.జీ.రంగా వర్సిటీ అగ్రిసెట్



విభాగాలు: అగ్రికల్చర్, సీడ్ టెక్నాలజీ, ఆర్గానిక్ ఫార్మింగ్

అర్హత: ఏఎన్‌జీఆర్ఏయూ/పీజేటీఎస్ఏయూ నుంచి రెండేళ్ల వ్యవధి గల డిప్లొమా(అగ్రికల్చర్/సీడ్ టెక్నాలజీ/ఆర్గానిక్ ఫార్మింగ్) పూర్తిచేసి ఉండాలి. అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి 17 ఏళ్లు నిండి ఉండాలి. జనరల్ అభ్యర్థులకు 22 ఏళ్లు; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 25 ఏళ్లు; దివ్యాంగులకు 27 ఏళ్లు మించకూడదు.

అగ్రిసెట్ వివరాలు: అభ్యర్థులు తమ డిప్లొమా స్ట్రీమ్‌లోనే అగ్రిసెట్ ఎగ్జామ్ రాయాలి. ఇది కంప్యూటర్ బేస్డ్ టెస్ట్. ఇందులో మొత్తం 120 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఇస్తారు. డిప్లొమా(అగ్రికల్చర్/సీడ్ టెక్నాలజీ/ఆర్గానిక్ ఫార్మింగ్) ప్రోగ్రామ్‌లకు ఏఎన్‌జీఆర్ఏయూ నిర్దేశించిన సిలబస్ ప్రకారం ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్న పత్రం తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో ఉంటుంది. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 120. నెగెటివ్ మార్కులు లేవు. పరీక్ష సమయం గంటన్నర. ఈ ఎగ్జామ్‌లో అర్హత సాధించాలంటే జనరల్ అభ్యర్థులకు కనీసం 25 శాతం(30)మార్కులు రావాలి.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 31
- **ఏఎన్‌జీఆర్ఏయూ అగ్రిసెట్ తేదీ:** ఆగస్టు 27 ● **వెబ్‌సైట్:** angrau.ac.in

HDFC Bank Parivartan's ECSS Programme

Description: HDFC Bank invites applications from students studying in Class 1 to the post-graduate level. The scholarship supports meritorious and needy students belonging to underprivileged sections of society.

Eligibility: The scholarship is open to Indian nationals only. The students must be studying in Class 1 to 12, or pursuing diploma, ITI, polytechnic, undergraduate or postgraduate (including general and professional) courses. The applicants must have passed their previous qualifying examination with at least 55% marks, and their annual family income must be less than or equal to INR 2.5 lakh. Preference will be given to applicants who have experienced personal or family crises in the past three years, preventing them from continuing to bear the cost of education and putting them at risk of dropping out.

Prizes & Rewards: Up to INR 75,000

Last Date to Apply: 04-09-2024

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/HDFC54

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/AT8a4gNలో చదవండి.

SCHOLARSHIP ALERT

Panasonic Ratti Chhatr Scholarship

Description: Panasonic Life Solutions India (PLSIND) invites applications from students enrolling in B.E./B.Tech. courses at the Indian Institutes of Technology (IITs).

Eligibility: Open for students across India who have cleared the entrance for admission into B.E./B.Tech. courses at any of the IITs (Indian Institute of Technology) in 2024-25. Applicants must have cleared their Class 12 examination or be awaiting final results. Applicants must have scored more than 75% marks in Class 12. The annual family income of the applicant must not be more than INR 8,00,000 from all sources. Only candidates from 2024-25 batch are eligible to apply.

Prizes & Rewards: Scholarship amount: INR 70,250 per year for four years

Last Date: 15-08-2024 ***Application:*** Online only

Short Url: www.b4s.in/aj/RCSP56

buddy4study.com

పోటీ పరీక్షల దిక్సూచి

కొత్త పుస్తకం

భారత రాజ్యాంగం - రాజకీయ వ్యవస్థ

మరి కొద్ది నెలల్లో తెలంగాణలో గ్రూప్-1 మెయిన్స్, గ్రూప్-2, గ్రూప్-3 పరీక్షలు నిర్వహించబోతున్నారు. అటు ఏపీలోనూ ఇటీవల కొలువు తీరిన కొత్త ప్రభుత్వం భారీ స్థాయిలో ప్రభుత్వ ఉద్యోగాల నియామకానికి సమాయత్తం అవుతోంది. పోటీ పరీక్షలు ఏవైనా...ఇండియన్ పాలిటీ ప్రాధాన్యం ఎనలేనిది. పైగా అన్ని సబ్జెక్టుల్లో కన్నా ఎక్కువ మార్కులు తెచ్చిపెట్టే సబ్జెక్టు కూడా ఇదే. ఈ నేపథ్యంలో పోటీ పరీక్షల శిక్షణలో చాలా అనుభవం ఉన్న డాక్టర్ సుంకర రమాదేవీ రచించిన 'భారత రాజ్యాంగం - రాజకీయ వ్యవస్థ' 15వ ఎడిషన్ మార్కెట్‌లోకి విడుదల అయ్యింది. దాదాపు 333 పోటీ పరీక్షల ప్రశ్న పత్రాలను అధ్యయనం చేసి ఈ పుస్తకానికి రూపకల్పన చేశారు. శాసన వ్యవస్థల కార్యనిర్వాహక, న్యాయవ్యవస్థ, రాజ్యాంగ, రాజ్యాంగేతర సంస్థల్లో వచ్చిన అన్ని పరిణామాలను, చట్టాలను, కోర్టుల తీర్పులను ఈ పుస్తకంలో పొందుపరిచారు. రాజ్యాంగ నిర్మాణ వివరాలతోపాటు ఉద్యమ చరిత్ర, రాజ్యాంగ చరిత్రలో ముఖ్య ఘట్టాలు, రాజ్యాంగం ఏర్పడటానికి దారితీసిన చారిత్రక పోరాటాలు - పరిణామాలు, బ్రిటిష్ పాలకులు అనుసరించిన వ్యూహాలు తదితర వివరాలన్నీ ఈ పుస్తకంలో ఉన్నాయి. భారత రాజకీయ వ్యవస్థకు సంబంధించిన ప్రతి అంశాన్నీ సంపూర్ణంగా, వాద ప్రతివాదాల సమాచారంతో ఎంతో ప్రామాణికంగా రూపొందించారు. అదేవిధంగా ఇండియా వర్సెస్ భారత్, ఉమ్మడి పౌర స్మృతి- ఒకే దేశం ఒకే చట్టం, పౌరసత్వ సవరణ చట్టం- విమర్శ, ఆర్టికల్ 370 రద్దు- సుప్రీంకోర్టు తీర్పు, కొత్త పార్లమెంట్ భవనం- సెంగోల్ స్థాపన, జమిలీ ఎన్నికలు - రామ్‌నాథ్ కోవింద్ కమిటీ, కొత్త నేర న్యాయ చట్టాలు, సాధారణ ఎన్నికల ఫలితాలు- 2024పై విశ్లేషణ, ఎలక్టోరల్ బాండ్స్ వంటి సమకాలీన అంశాలను వివరంగా చర్చించారు. సమగ్రమైన రాజ్యాంగ విశ్లేషణను, భారత రాజకీయాలకు సంబంధించిన సమాచారాన్ని, చారిత్రక పరిణామాలను వివిధ పట్టికల రూపంలో చక్కగా అందించారు. ఈ పుస్తకం కేవలం ఏపీపీఎస్సీ, టీజీపీఎస్సీ, ఇతర పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులకే కాదు విద్యార్థులకు, అధ్యాపకులకు, న్యాయవాదులకు, స్వచ్ఛంద సేవా సంస్థలు నిర్వహించే వారికి కరదీపిక వలె ఉపయోగపడుతుంది.



పుస్తకం పేరు: భారత రాజ్యాంగం - రాజకీయ వ్యవస్థ (15వ ఎడిషన్)
పేజీలు: 1202(రెండు వాల్యూమ్స్ కలిపి)
వెల: రూ.899/- **ప్రతులకు:** శ్రీ తేజ పబ్లికేషన్స్, గాంధీనగర్, హైదరాబాద్-500080 **ఫోన్ నెం:** 8686430054, 8686430055

నవ్య | చిత్రజ్యోతి

బ్రహ్మరాక్షసుడిలా...



తమిళ కథానాయకుడు ధనుష్ 50వ చిత్రం 'రాయన్'. ఈ సినిమాకు ఆయనే దర్శకుడు కూడా. సందీప్‌కిషన్, కాళిదాస్ జయరామ్ కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా ట్రైలర్‌ను మంగళవారం విడుదల చేశారు. 'బ్రహ్మరాక్షసుడిలా వస్తాడు.. దహనం చేస్తాడు' అంటూ ధనుష్ పాత్రను పరిచయం చేశారు. యాక్షన్ ప్యాక్ ఎలిమెంట్స్‌తో ట్రైలర్ అదిరిపోయింది. ఇందులో నటించిన సందీప్‌కిషన్, ప్రకాశ్‌రాజ్, ఎస్.జె.సూర్య, కాళిదాస్ జయరామ్ ముఖ్య పాత్రలో కనిపించారు. ఆస్కార్ విన్నర్ ఏ.ఆర్.రెహమాన్ నేపథ్యం సంగీతం అలరించింది. పీటర్ హెయిన్ యాక్షన్ కొరియోగ్రఫీ స్పెషల్ ఎట్రాక్షన్‌గా నిలిచింది. ఈ నెల 26న 'రాయన్' చిత్రం విడుదల కానుంది. తెలుగు వెర్షన్‌ను ఏషియన్ సురేశ్ సురేశ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ విడుదల చేయనుంది.

ఆ రోజులు మళ్లీ రాకూడదు




'గడచిన మూడేళ్ల ఎన్నో ఆటుపోట్లు చవిచూశాను. నా జీవితం తీవ్రమైన ఒడిదుడుకులతో గడిచింది. ఆ రోజులు నా జీవితంలో మళ్లీ రాకూడదు అని కోరుకుంటున్నాను' అని హీరోయిన్ సమంత అన్నారు. ఆమె ఇటీవలే ఓ మీడియా ఇంటర్వ్యూలో తన సినిమాలు, వ్యక్తిగత జీవితం గురించి మాట్లాడారు. 'మన జీవితాల్లో కొన్ని సంఘటనలు చేదు అనుభవాలుగా మిగిలిపోతాయి. ఎంత ప్రయత్నించినా మనం వాటిని ఆపలేం. అలాంటప్పుడు వాటిని అంగీకరించి, అధిగమిస్తూ ముందుకెళ్లడమే మనం చేయాల్సింది. కష్టకాలంలో ఆధ్యాత్మికత నాకు స్ఫూర్తినిచ్చింది. వ్యక్తిగతంగా, కెరీర్ పరంగా నాలో మంచి మార్పులకు కారణమైంది. ఈతరం ఎక్కువగా మానసిక అనారోగ్యానికి గురవుతోంది. ఆధ్యాత్మిక చింతన అలవరుచుకోవడం వల్ల ప్రశాంతంగా ఉండొచ్చు. ప్రస్తుతం నా జీవితం బావుంది. నేను మునుపటికన్నా బావున్నాను' అని సమంత చెప్పారు. కొత్త సినిమాల గురించి మాట్లాడుతూ 'ఈ ప్రపంచంలో నాకు బాగా ఇష్టమైన విషయం కెమెరా ముందు నిల్చోవడమే. ఆగస్టు నుంచి కొత్త సినిమా షూటింగ్‌లో పాల్గొంటాను. నా పాత్ర కోసం తర్ఫీదు అవుతున్నాను. విలువిద్య, గుర్రపు స్వారీలో శిక్షణ తీసుకుంటున్నాను. నేను నేర్చుకోవాల్సింది ఇంకా చాలా ఉంది. అందుకే కొత్త నైపుణ్యాలు నేర్చుకునే అవకాశం ఉన్న కథలనే ఎంపిక చేసుకుంటున్నాను' అని ఆమె చెప్పారు. సమంత స్వీయ నిర్మాణంలో తెరకెక్కుతోన్న చిత్రం 'మా ఇంటి బంగారం'లో నటిస్తున్నారు. ఆమె నటించిన 'హనీ-బన్నీ' వెబ్‌సిరీస్ త్వరలో స్ట్రీమింగ్ అవనుంది.

ఇది సెలబ్రేట్ చేసుకోవాల్సిన విజయం




'నా సినీ జీవితంలో 200కు పైగా సినిమాలు చేశాను. అయితే వాటిలో అన్ని సినిమాలు ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించి ఉండకపోవచ్చు. కానీ 'కల్కి 2898 ఏడీ' విజయాన్ని మాత్రం కచ్చితంగా సెలబ్రేట్ చేసుకోవాలి. సినిమా విడుదలైనప్పటి నుంచి నాకు ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి' అని నటుడు కమల్‌హాసన్ అన్నారు. ప్రభాస్ కథానాయకుడిగా నాగ్ అశ్విన్ దర్శకత్వం వహించిన 'కల్కి 2898 ఏడీ' చిత్రం బాక్సాఫీసు దగ్గర సంచలన విజయాన్ని అందుకోవడంతో పాటు రూ. వెయ్యికోట్ల వసూళ్లను అధిగమించిన సందర్భంగా ఈ చిత్రంలో కీలకపాత్ర పోషించిన కమల్‌హాసన్ ఓ వీడియోను విడుదల చేశారు. అందులో ఆయన మాట్లాడుతూ "కల్కి చిత్రానికి వసూళ్ల పరంగా వస్తున్న ఆదరణ చూస్తుంటే చాలా ఆనందంగా ఉంది. ఈ చిత్రంలో యాస్కిన్ పాత్ర కోసం చాలా కసరత్తు జరిగింది. చాలా కష్టపడ్డాం. మేకప్ కోసం లాస్ ఏంజెల్స్ వెళ్లాం. మొదట్లో నా గెటప్ చూసి నాకే ఎబ్బెట్టుగా అనిపించినా, క్రమంగా ఉత్సాహం కలిగింది. రెండో భాగంలో నా పాత్ర నిడివి ఎక్కువగా ఉంటుంది. భారతీయ చిత్ర పరిశ్రమలోని దిగ్గజాలు అంతా ఈ చిత్రంలో కలసి నటించారు. ఒకప్పుడు సింగీతం శ్రీనివాసరావులా ఇప్పుడు నాగ్ అశ్విన్ కూడా ప్రేక్షకులను మాయ చేశారు. చిన్నపిల్లలు ఆటలో లీనమైపోయినట్లు పాత్రధారులందరూ తమ తమ పాత్రల్లో జీవించారు. సినిమా చూసిన ప్రేక్షకులు ఎంత సంతోషిస్తే మేము అంతగా సంతోషిస్తాం' అని పేర్కొన్నారు.

విలన్‌గా అభిషేక్ బచ్చన్



బాలీవుడ్‌లో ఒక్కో హీరో ఇప్పుడు విలన్‌గా మారుతున్నారు. సంజయ్‌దత్, సైఫ్ అలీఖాన్, రణ్‌వీర్ సింగ్, బాబీ డియోల్... ఇలా . తాజాగా ఈ జాబితాలోకి అభిషేక్ బచ్చన్ చేరబోతున్నారు. షారుఖ్‌ఖాన్ కొత్త చిత్రం 'కింగ్'లో అభిషేక్ విలన్‌గా నటిస్తున్నారు. ఈ విషయాన్ని ఆయన తండ్రి అమితాబ్ స్వయంగా వెల్లడించడం విశేషం. 'ఇదే సమయం' అంటూ తనయుడు అభిషేక్‌కు అభినందనలు తెలుపుతూ సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారు అమితాబ్. గత ఏడాది 'జవాన్', 'పఠాన్' చిత్రాలతో బ్యాక్ టు బ్యాక్ హిట్స్ ఇచ్చిన షారుఖ్ ఖాన్ ఇప్పుడు 'కింగ్' చిత్రం కోసం సిద్ధమవుతున్నారు. ఆయన కుమార్తె సుహానా ఈ సినిమాలో మరో కీలక పాత్ర పోషించనున్నారు. తండ్రీ కూతుళ్ల కలసి నటిస్తున్న తొలి చిత్రం ఇదే. యాక్షన్ థ్రిల్లర్‌గా రూపుదిద్దుకుంటున్న 'కింగ్' చిత్రానికి సుజయ్ ఘోష్ దర్శకత్వం వహిస్తున్నారు.

మాస్‌ను ఆకట్టుకునేలా...



రామ్ పోతినేని ప్రస్తుతం పూరి జగన్నాథ్ దర్శకత్వంలో పాన్ ఇండియా సినిమాగా తెరకెక్కుతోన్న 'డబుల్ ఇస్మార్ట్'లో నటిస్తున్నారు. ఇది 2019లో విడుదలై బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్‌ను అందుకున్న 'ఇస్మార్ట్ శంకర్'కు సీక్వెల్. ఈ సినిమాలో హీరోయిన్‌గా కావ్య థాపర్ నటిస్తున్నారు. బాలీవుడ్ నటుడు సంజయ్‌దత్, అలీ, గెటప్ శ్రీను కీలక పాత్రలు పోషిస్తున్నారు. పూరి కనెక్ట్ బ్యానర్‌పై పూరి జగన్నాథ్, చార్మి కౌర్ నిర్మిస్తున్నారు. ఆగస్టు 15న విడుదలవుతోంది. ఇటీవలే విడుదలైన టీజర్ అందరికీ నచ్చడమే కాకుండా.. సినిమాపై అంచనాలను పెంచింది. మంగళవారం ఈ సినిమా నుంచి సెకండ్ సింగిల్ 'మార్ ముంతా చోడ్ చింత'ను మేకర్స్ విడుదల చేశారు. మాస్‌ను ఆకట్టుకునేలా ఈ సాంగ్‌లోని లిరిక్స్, డాన్స్ మూమెంట్స్ సాగాయి. ఈ పాటకు శ్యామ్ సాహిత్యం అందించగా రాహుల్ సిప్లిగంజ్, ధనుంజయ్ సీపాన, కీర్తన శర్మ ఆలపించారు. మణిశర్మ సంగీతం అందించారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్: సామ్ కె నాయుడు, జియాని జియాన్నెలి

ముద్దు సీన్‌కు మూడు కట్స్



'యానిమల్' సినిమాలో బోల్డ్ సీన్స్‌లో పాల్గొని అందరి దృష్టినీ ఆకర్షించిన హాట్ గర్ల్ త్రిప్తి దిమ్రీ నటించిన తాజా చిత్రం 'బ్యాడ్ న్యూజ్'. విక్కీ కౌశల్ హీరోగా నటించిన ఈ రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ ఈ నెల 19న విడుదల కానుంది. వాస్తవ సంఘటనల ఆధారంగా రూపుదిద్దుకున్న ఈ చిత్రంలో హీరోహీరోయిన్ల మధ్య ముద్దు సీన్లు మూడు ఉన్నాయట. ఈ మధ్యకాలంలో కిస్సింగ్ సీన్లను చూసీ చూడనట్లు వదిలేస్తున్న సెన్సార్ వారు 'బ్యాడ్ న్యూజ్' చిత్రం మీద కన్నెర్ర చేసి, కత్తెరకు పని చెప్పారట. విక్కీ, త్రిప్తి పై చిత్రీకరించిన ముద్దు సీన్లు మోతాదు మించి ఉన్నాయనీ, తగ్గించాలని సెన్సారు అధికారి చెప్పడంతో చేసేదేమీ లేక వాటిని తగ్గించి విడుదల చేస్తున్నారు. త్రిప్తి అభిమానులకు ఇది బ్యాడ్ న్యూసే కదా!

పవర్‌ఫుల్ పాత్రలో



పీఎస్ మిత్రన్ దర్శకత్వంలో కార్తి కథానాయకుడిగా రూపొందుతున్న తెలుగు, తమిళ ద్విభాషా చిత్రం 'సర్దార్ 2'. వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన 'సర్దార్' చిత్రానికి ఇది కొనసాగింపు. కొన్ని రోజుల క్రితమే రెగ్యులర్ చిత్రీకరణ ప్రారంభమైంది. తాజాగా చిత్రబృందం అప్‌డేట్ ఇచ్చింది. నటుడు, దర్శకుడు ఎస్‌జె సూర్య ఈ చిత్రంలో పవర్‌ఫుల్ రోల్‌లో నటిస్తున్నట్లు మంగళవారం తెలిపింది. ఎస్. లక్ష్మణ్‌కుమార్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి యువన్ శంకర్‌రాజా సంగీతం అందిస్తున్నారు.

ఆ రోజులు గుర్తొస్తున్నాయి



'ప్రతి సినిమాను ఎంతో ప్యాషన్‌తో తీసే నిర్మాత వేణుగోపాల్. ఆయనకు మంచి టేస్ట్ ఉంది. లవ్ స్టోరీస్ మీద పట్టుంది. ఈ సినిమా టీమ్‌ను, హీరోలను చూస్తుంటే నాకు 'ఈ నగరానికి ఏమైంది' రోజులు గుర్తుకు వస్తున్నాయి' అన్నారు హీరో విష్వక్‌సేన్. 'రేటీ కపడా రొమాన్స్' చిత్రంలోని 'గలీజ్' సాంగ్‌ను ఆయన అవిష్కరించి మాట్లాడారు. సృజన్ కుమార్ బొజ్జం తో కలసి బెక్కం వేణుగోపాల్ ఈ చిత్రాన్ని నిర్మించారు. హర్ష నర్రా, సందీప్ సరోజ్, తరుణ్ హీరోలుగా నటించిన ఈ చిత్రానికి విక్రమ్ రెడ్డి దర్శకుడు. నిర్మాత బెక్కం వేణుగోపాల్ మాట్లాడుతూ 'ఓ కొత్త పాయింట్‌ను ప్రేక్షకులకు చెప్పాలని ఈ యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌ని నిర్మించాం. ఇటీవల కొంతమంది యూత్‌కి ఈ సినిమా చూపించాం. వారు ఇచ్చిన ఫీడ్ బ్యాక్‌తో మా కాన్ఫిడెన్స్ మరింత పెరిగింది' అన్నారు. ఆగస్టు 2న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు మరో నిర్మాత సృజన్‌కుమార్ చెప్పారు.

ఆకట్టుకునే విజువల్స్‌తో... 'మా ఊరి జాతరలో'



అల్లరి నరేశ్, అమృత అయ్యర్ జంటగా నటిస్తున్న చిత్రం 'బచ్చల మల్లి'. సుబ్బు మంగదేవి దర్శకత్వంలో రాజేశ్ దండా, బాలాజీ గుత్తా నిర్మించారు. ఇటీవలే విడుదలైన ఫస్ట్ లుక్, గ్లింప్స్ సినిమాపై ఆసక్తిని రేకెత్తించాయి. మంగళవారం ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్ 'మా ఊరి జాతరలో' పాటను మేకర్స్ రిలీజ్ చేశారు. ఈ ఫోక్ సాంగ్‌లో లీడ్ పెయిర్ కెమిస్ట్రీ, విజువల్స్ ఆకట్టుకునేలా ఉన్నాయి. సింధూరి విశాల్, హరిగౌర ఆలపించగా, విశాల్ చంద్రశేఖర్ సంగీతం అందించారు. ఈ చిత్రానికి ఎడిటర్ : చోటా కె ప్రసాద్, డీఓపీ : ఎం. రిచర్డ్ నాథన్.

రాజ్ తరుణ్‌కు నోటీసులు ?



సినిమా హీరో రాజ్ తరుణ్‌పై లావణ్య చేసిన ఫిర్యాదులో రాజ్ తరుణ్‌ను విచారించేందుకు నార్సింగ్ పోలీసులు సిద్ధమయ్యారు. రేపు విచారణకు హాజరు కావాలని రాజ్‌తరుణ్‌కు నోటీసులు జారీ చేసినట్లు తెలుస్తోంది. ఆయన వాంగ్మూలాన్ని రికార్డ్ చేయడంతో పాటు పలు అంశాలపై ఆరా తీయనున్నారు. రాజ్ తరుణ్‌కు నోటీసులు ఇచ్చినట్లు మంగళవారం ప్రచారం జరిగింది. అయితే ఈ కేసులో నోటీసుల విషయంపై నార్సింగ్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డిని వివరణ కోసం సంప్రదించగా ఆయన స్పందించలేదు.

- నార్సింగ్ (ఆంధ్రజ్యోతి)

ముగ్గురు స్నేహితుల కథ



మక్కా శ్రీను, సుచిత్ర రాథోడ్, దిల్ రమేశ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'ఎస్.ఐ.కోదండపాణి'. రెంటాల నాగేంద్ర దర్శకత్వంలో మక్కా శ్రీదేవి నిర్మిస్తున్నారు. మంగళవారం ఈ సినిమా ప్రీమియర్ షోను మీడియాకు ప్రదర్శించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ రెంటాల నాగేంద్ర మాట్లాడుతూ "కొన్ని వాస్తవ సంఘటనల ఆధారంగా సినిమాను తెరకెక్కించాను. ముగ్గురు స్నేహితులు ఓ మర్డర్ మిస్టరీలో ఇరుక్కుని ఎలా బయటపడ్డారనేది సినిమా కథ" అని అన్నారు. "కుటుంబ సమేతంగా చూడాల్సిన సినిమా ఇది. అందరినీ తప్పకుండా ఆకట్టుకుంటుంది" అని నిర్మాత శ్రీదేవి అన్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: ఉదయ్, కెమెరామెన్: సబరి, సంగీతం: సాల్మన్.

సమాజానికి అవసరమైన ఇండియా ఫైల్స్



తెలంగాణ కాంగ్రెస్ ఎమ్మెల్యే అద్దంకి దయాకర్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'ఇండియా ఫైల్స్', ఇంద్రజ, సుమన్, శుభలేఖ సుధాకర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. డాక్టర్ బొమ్మకు మురళి స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్నారు. మంగళవారం ఈ సినిమా ఆడియో వేడుకను నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ "ఈ చిత్రంలో నటిస్తున్న ప్రతీ ఒక్కరికీ నా అభినందనలు. ఈ మూవీ టీమ్‌తో నాకు మంచి అనుబంధం ఉంది. ప్రస్తుత సమాజానికి ఇలాంటి చిత్రం అవసరం" అని చెప్పారు. "ఈ సినిమా విడుదల తర్వాత ఇలాంటి తరహా కథలు మరిన్ని తెరకెక్కుతాయి. మంచి కంటెంట్ ఉన్న చిత్రమిది" అని ఎమ్మెల్యే అద్దంకి దయాకర్ చెప్పారు. "ప్రపంచంలో ప్రతీ మూలకు వెళ్లగలిగేది సినిమా మాత్రమే" అని దర్శకుడు బొమ్మకు మురళీ తెలిపారు. ఈ చిత్రానికి ఎడిటర్: కార్తీక్, డీఓపీ: జి.ఎల్.బాబు, సంగీతం:ఎమ్.ఎమ్.కీరవాణి.

మంచి కంటెంట్‌తో రేవు



వంశీ రామ్ పెండ్యాల, అజయ్, స్వాతి భీమిరెడ్డి, ఏపూరి హరి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'రేవు'. హరినాథ్ పులి దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి డాక్టర్ మురళీ గింజుపల్లి, నవీన్ పారుపల్లి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. తాజాగా, ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను డైరెక్టర్ బాబీ చేతుల మీదుగా రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "ఈ సినిమా విజువల్స్ బాగున్నాయి. మంచి కంటెంట్ ఉన్న ఈ సినిమా అందరినీ ఆకట్టుకుంటుంది" అని అన్నారు. "ఇదొక విభిన్న తరహా సినిమా. అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చేలా ఉంటుంది" అని దర్శకుడు హరినాథ్ పులి చెప్పారు. ఈ సినిమాకు ఎడిటర్: శివ శర్వాని, డీఓపీ: రేవంత్ సాగర్, నిర్మాణ పర్యవేక్షణ: సీనియర్ జర్నలిస్ట్ ప్రభు, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: పర్వతనేని రాంబాబు.



వ్యవస్థాపక దినోత్సవంలో అతిథులు, అధ్యాపకులు, ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

వ్యవసాయ కళాశాలకు అంతర్జాతీయ ఖ్యాతి

- రాజమండ్రి ఐటీసీ లిమిటెడ్ సీనియర్ లీడ్ సైంటిస్ట్, కళాశాల పూర్వవిద్యార్థి డాక్టర్ బి.ఎస్.రామచంద్రారెడ్డి
- ఘనంగా బాపట్ల వ్యవసాయ కళాశాల వ్యవస్థాపక దినోత్సవం

బాపట్ల, జూలై 16: బాపట్ల వ్యవసాయ కళాశాల అంతర్జాతీయ ఖ్యాతినార్జించిందని రాజమండ్రి ఐటీసీ లిమిటెడ్ సీనియర్ లీడ్ సైంటిస్ట్, కళాశాల పూర్వవిద్యార్థి డాక్టర్ బి.ఎస్.రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని బాపట్ల వ్యవసాయ కళాశాల 79వ వ్యవస్థాపక దినోత్సవం మంగళవారం కళాశాలలోని డాక్టర్ బీవీనాథ్ ఆడిటోరియంలో జరిగింది. కార్యక్రమానికి కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి.ప్రసూనారాణి అధ్యక్షత వహించారు. రామచంద్రారెడ్డి ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ ఈ కళాశాల పూర్వవిద్యార్థిగా తాను కష్టపడే తత్వం, పట్టుదలలాంటి లక్షణాలు ఈ ప్రాంగణంలోనే నేర్చుకున్నానని చెప్పారు. ప్రయత్నించి ఓడిపోయినా పర్వాలేదు. కానీ ప్రయత్నించటంలో ఓడిపోవద్దని చెప్పారు. ఎంతఎత్తు ఎదిగినా మానవత్వాన్ని, సేవాభావాన్ని మరిచిపోవద్దని వివరించారు. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ గాజుల రామచంద్రరావు మాట్లాడుతూ దేశంలోనే అత్యున్నతమైన వ్యవసాయ కళాశాల బాపట్లలో ఉందన్నారు. ఉత్తమ సాంకేతిక ప్రచురణలు చేసిన విద్యార్థులు బి.రెడ్డి లక్ష్మీ, ఎం.బాలభారతి, ఎ.కావ్యలను పతకాలతో సత్కరించారు. విద్యలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పి.లక్ష్మీ సాహితి, కె.కావ్యలకు బంగారు పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఏఎజీటీసీడీ ఎగ్జిక్యూటివ్‌మెంబరు డాక్టర్ కె.సుశీల, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ లాల్ అహ్మద్, కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి.ప్రసూనారాణిలు కళాశాల పురోగతిని వివరించారు. దేశంలోనే అత్యుత్తమైన బీపీటీ 5204 వరి వంగడాన్ని 1983లో డాక్టర్ ఎం.వి.రెడ్డి ఇక్కడే సృష్టించారని తెలిపారు. కార్యక్రమంలో పూర్వ ఆచార్యులు డాక్టర్ గోపిచంద్ర, డాక్టర్ బాలినేని వెంకటేశ్వర్లు, డాక్టర్ శేషగిరిరావు, డాక్టర్ ఉల్చి శంకరరావు, డాక్టర్ పి.ఆర్.కె.ప్రసాద్, డాక్టర్ జి.సుబ్బయ్య, డాక్టర్ రత్నకుమారి, డాక్టర్ పి.హరిప్రసాద్‌లను ఘనంగా సన్మానించారు. పూర్వ అడ్మినిస్ట్రేటివ్ అధికారులు సి.హెచ్.కోటేశ్వరరావు, కోల్, ఐ.కోటేశ్వరరావులను సత్కరించారు. కార్యక్రమంలో విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

19న అరుణాచలానికి మూడు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

గుంటూరు, జూలై 16: ఈ నెల 21న పౌర్ణమి సందర్భంగా అరుణాచలంలో గిరి ప్రదక్షిణకు భక్తుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించినట్లు గుంటూరు-2 డిపో మేనేజర్ అబ్దుల్ సలాం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్టీఆర్ బస్టాండ్ నుంచి 19న రాత్రి 9.15, 9.30, 9.45 గంటలకు బయల్దేరి 20వ తేదీన శ్రీకాళహస్తి, కాణిపాక, శ్రీపురం గోల్డెన్ టెంపుల్ దర్శించుకొని ఆ రోజు రాత్రి అక్కడే బస చేసి 21న పౌర్ణమి రోజున అరుణాచలంనకు చేరుకుంటుందన్నారు. అదేరోజు సాయంత్రం బయల్దేరి 22వ తేదీన ఉదయం 6.30, 6.45, 7గంటలకు గుంటూరు బస్టాండ్‌కు చేరుకుంటాయన్నారు. 96164, 96089, 91700 సర్వీసులకు ఆన్‌లైన్ ద్వారా రిజర్వేషన్ చేసుకునే అవకాశం కల్పించారు. ఒక్కోఛార్జీ రూ.2420గా పేర్కొన్నారు. అదనపు సమాచారం కోసం 7382897459 నంబరులో సంప్రదించాలని కోరారు.

రోజుకు సగటున 5 వేల టన్నుల ఇసుక సరఫరా



- వారంలోనే రూ.కోటి మేర ప్రజలకు లబ్ధి
- ఇంకా స్టాక్‌పాయింట్లలో 9 లక్షల ఎంటీలకు పైగా ఇసుక లభ్యత

గుంటూరు, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఉచిత ఇసుక విధానం ద్వారా జిల్లా ప్రజలకు ఆర్థికంగా లబ్ధి చేకూరుతున్నది. వైసీపీ ప్రభుత్వ హయాంలో స్టాక్‌యార్డు వద్ద కేవలం ఇసుకకే టన్నుకు రూ.450వరకు చెల్లించాల్సిన పరిస్థితి ఉండటంతో అప్పట్లో లారీ ఇసుక రూ.25వేలు దాటిపోయేది. ఇప్పుడు ఇసుక ఉచితంగా ప్రభుత్వం ఇస్తుండటంతో ప్రజలు కేవలం లోడింగ్, రవాణాఛార్జీలు మాత్రమే భరించి తీసుకెళుతున్నారు. దీనివలన 20 టన్నుల లారీపై ఇసుక ఛార్జీల రూపంలో రూ.5వేలు ఆదా అవుతున్నది. జిల్లాలో తొమ్మిది రోజులుగా జరుగుతున్న ఉచిత ఇసుక సరఫరా ఎలాంటి సమస్యలు లేకుండా సజావుగా సాగుతున్నది. ఒకటి, రెండు చోట్ల మాత్రం వర్షాల కారణంగా స్టాక్‌యార్డు వద్దకు లారీలు వెళ్లలేని పరిస్థితి నెలకొన్నది. దీనివలన అక్కడ మందకొడిగా ఇసుక సరఫరా జరుగుతోంది.

జిల్లాలో మొత్తం ఐదు స్టాక్‌యార్డుల ద్వారా ప్రజలకు ఉచిత ఇసుక సరఫరా జరుగుతున్నది. ఈ విధానాన్ని ప్రారంభించేనాటికి అన్ని స్టాక్‌యార్డుల్లో కలిపి 9,23,372.45 మెట్రిక్ టన్నుల ఇసుక లభ్యత ఉన్నది. వర్షాకాలంలో కృష్ణానదికి వరద పోటెత్తినా ఇసుకకి ఎలాంటి ఇబ్బంది పడాల్సిన అవసరం లేకుండా ఈ స్టాక్‌యార్డుల్లో నిల్వలు సరిపోతాయి. కొల్లిపరలో ఇప్పటి వరకు 6,738.5 మెట్రిక్‌టన్నుల ఇసు కని ప్రజలు ఉచితంగా తీసుకె ళ్లారు. అలానే మున్నంగిలో 3,062, గుండిమెడలో 566, తాళ్లాయపాలెంలో 3,146.399, లింగాయపాలెంలో 6394 మెట్రిక్ టన్నుల ఇసుకని ప్రజలకు సరఫరా చేశారు. వీటిన్నింటిని కలిపితే దాదాపుగా 20 వేల మెట్రిక్‌టన్నులకు పైగా ఇసుక ఇళ్ల నిర్మాణాలకు చేరింది. దీనివలన ఇసుక ఛార్జీల రూపంలో ప్రజలకు రూ.కోటి వరకు ఆదా అయింది.

కాగా లోడింగ్ ఛార్జీల రూపంలో టన్నుకు రూ.250 చొప్పున రాష్ట్ర ప్రభుత్వానికి రూ.50లక్షల వరకు ఆదాయం సమకూరింది. కొన్ని నెలల క్రితమే ఇరిగేషన్ శాఖ తన సొంత నిధులను వెచ్చించి కృష్ణానదిలో నుంచి ఇసుక పూడికని తొలగించి స్టాక్‌యార్డుల్లో గుట్టలుగా పోసింది. అందుకు అయిన ఖర్చు ఇప్పుడు కొంతమేరకు లోడింగ్ ఛార్జీల రూపంలో సమకూరుతున్నది. గుంటూరు నగరానికి వేర్వేరు స్టాక్‌యార్డుల నుంచి ఇసుక వస్తున్నది. ఇక్కడికి చేరేసరికి 10 టన్నుల లారీ అయితే లోడింగ్, రవాణ ఛార్జీలు కలిపి రూ.7,500నుంచి రూ.8వేల వరకు తీసుకుంటున్నారు. అదే 10 టైర్ల లారీ అయితే రూ.13వేల నుంచి రూ.14వేల వరకు వసూలు చేస్తున్నారు. అదే గత వైసీపీ ప్రభుత్వం ఈ ఛార్జీలు రెట్టింపు మోతాదులో ఉండేవి. అప్పటి ధరతో బేరీజు వేస్తూ చిన్న లారీకి అయితే రూ.4,500, 10 టన్నుల లారీకి అయితే రూ.10వేల వరకు మిగులుతున్నట్లు భవన నిర్మాణదారులు చెబుతున్నారు.

జగనన్న కాలనీ కోసం అధికారుల అత్యుత్సాహం

- మురుగు కాల్వను పూడ్చివేసిన వైనం
- మురుగు పారక గత నాలుగేళ్లుగా రైతుల పాట్లు
- 110 ఎకరాల్లో మురుగునీటి పారుదల ప్రశ్నార్థకం



మురుగుకాల్వ పూడ్చివేసి జగనన్న ఇంటిస్థలాలకు కేటాయించిన భూమి



మూల్పూరు వద్ద పంట పొలాల్లో నిలిచిన వర్షపు నీరు

అమృతలూరు, జూలై 16: అధికారుల అత్యుత్సాహానికి రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని మూల్పూరులో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పేదలకు ఇంటిస్థలాల కోసం రైతుల నుండి భూములు సేకరించారు. ఈ సేకరించిన భూముల్లో నుండి మురుగు బయటకు వెళ్లే కాల్వను పూడ్చివేసి పేదలకు ఇళ్లస్థలాలను కేటాయించారు. ఈ కాల్వ పూడ్చడం వల్ల 110 ఎకరాల్లో నుండి పారుదల కావాల్సిన మురుగు నీరు తమ పంట పొలాల్లోనే నిలిచిపోతుందని రైతులు అధికారుల దృష్టికి తెచ్చారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లుచేస్తామని, రైతులకు ఇబ్బంది లేకుండా చేస్తామని వారు హామీ ఇచ్చారు. గత నాలుగేళ్లుగా తాము పడుతున్న ఇబ్బందిని అధికారులు దృష్టికి తీసుకువెళుతున్నా ప్రయోజనం లేకుండా పోయిందని రైతులు ఆగ్రహం వ్యక్త చేస్తున్నారు. ఈ ఏడాది పొలాల్లో వెద నాటు వేశామని కురుస్తున్న భారీ వర్షాల కారణంగా పంట పొలాల్లో నీరు నిలవడంతో మురుగునీరు బయటకు పోక వెదనారు దెబ్బతింటోందని రైతులు చెబుతున్నారు. ఆర్థికంగా నష్టపోతామని రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం స్పందించి తమ సమస్య పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.



ప్రత్యేక పూజల్లో పాలొన్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

బొప్పూడి వెంకటేశ్వరస్వామికి ప్రత్తిపాటి ప్రత్యేకపూజలు

- తొలి ఏకాదశి ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే

చిలకలూరిపేట అర్బన్, జూలై 16: రాష్ట్రంలో మొదలైన అభివృద్ధి యజ్ఞానికి ఎలాంటి ఆటంకాలు కలగకూడదని ఆ భగవంతుడిని ప్రార్థిస్తూ ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ప్రత్యేకపూజలు నిర్వహించారు. బుధవారం విశిష్టమైన తొలి ఏకాదశిని పురస్కరించుకొని చిలకలూరిపేట మండలం బొప్పూడి కొండపై ఉన్న శ్రీకళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ముందస్తు పూజలు చేశారు. తొలి ఏకాదశి పర్వదినం ఏర్పాట్లపై అధికారులతో చర్చించి భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కూటమి ప్రభుత్వాకి ఆ దేవుడి ఆశీస్సులు ఎప్పుడూ మెండుగా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఏర్పడిన నెల రోజుల వ్యవధిలోనే ఇచ్చిన హామీల్లో సింహభాగం అమలు చేస్తూ ప్రజలకు చేరువయ్యామని, ఆ అక్కసుతోనే వైసీపీ అసత్య ప్రచారాలకు దిగుతోందని, వైసీపీ అధ్యక్షుడు జగన్‌రెడ్డికి ఇకనైనా మంచిబుద్ధిని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. తొలుత ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీ కృష్ణమోహన్ దంపతులను ప్రత్తిపాటి మర్యాదపూర్వకంగా కలసి శాలువాతో సత్కరించారు. అనంతరం ఆలయ అర్చకులు ఆశీర్వచనాలు, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు జువ్వాజి మదన్ మోహన్, ఇతర టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో ఏపీకి చెందిన ఇద్దరికి అవార్డు

- కేంద్ర మంత్రి జితిన్ ప్రసాదుచే ప్రదానం

చిలకలూరిపేట, జూలై 16: కామన్ సర్వీసెస్ సెంటర్ ద్వారా వినియోగ దారులకు అత్యుత్తమ రీతిలో సేవలను అందించినందుకుగాను ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఇద్దరికి కేంద్ర ప్రభుత్వం అత్యున్నత సేవా అవార్డులు ఇచ్చింది. కేంద్ర వాణిజ్య, పరిశ్రమలు, ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సహాయ మంత్రి జితిన్ ప్రసాదు మంగళవారం కొత్త ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డును వారికి అందజేశారు. అవార్డును అందుకున్న వారిలో నిజాంపట్నంకు చెందిన ఆలపాటి సంధ్య, చిలకలూరిపేటకు చెందిన నార్నె గోపీనాథ్ ఉన్నారు. కామన్ సర్వీసెస్ సెంటర్ ద్వారా అత్యధిక సంఖ్యలో కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన పథకాల లావాదేవీలను జరిపినందుకు వారికి ఈ అవార్డు లభించింది. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో ప్రజలకు ఉత్తమ రీతిలో సేవలందించిన పదిమందిని గుర్తించింది. వారిలో ఏపీకి చెందిన ఈ ఇద్దరు ఉన్నారు. ఆలపాటి సంధ్య 1,02,952, నార్నె గోపీనాథ్ 84,526 లావాదేవీలు గత ఆర్థిక సంవత్సరంలో జరిపి జాతీయస్థాయిలో వరుసగా 2, 3 స్థానాల్లో నిలిచారు. వారిని ప్రభుత్వం అన్ని ఖర్చులు భరించి ఢిల్లీకి ప్రత్యేకంగా ఆహ్వానించి సత్కారం చేశారు.



ఢిల్లీలో అవార్డు అందుకుంటున్న ఆలపాటి సంధ్య, నార్నె గోపీనాథ్

యూపీహెచ్‌సీని తనిఖీ చేసిన ఎన్‌హెచ్‌ఏం డైరెక్టర్



ఆరోగ్యశ్రీ కేంద్రంలో తనిఖీ చేస్తున్న ఎన్‌హెచ్‌ఏం డైరెక్టర్ ఆరాధనా పట్నాయక్

తాడేపల్లి టౌన్, జూలై 16: తాడేపల్లి డ్రైవర్స్ కాలనీ పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని కేంద్ర కుటుంబ ఆరోగ్య సంక్షేమ మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి, ఎన్‌హెచ్‌ఏం డైరెక్టర్ ఆరాధనా పట్నాయక్ మంగళవారం తనిఖీ చేశారు. రాష్ట్రంలో గత ఏడాది కాలంగా జాతీయ నాణ్యతా ప్రమాణాల హామీ విధి విధానాలు అమలుచేస్తూ అర్హతపత్రాలు పొందిన అన్ని ప్రాథమిక పట్టణ ఆరోగ్య కేంద్రాలలో అదేస్థాయిలో నాణ్యతా ప్రమాణాలు కొనసాగిస్తారా లేదా అనేది ప్రత్యక్షంగా పరిశీలించేందుకు కేంద్ర కుటుంబ ఆరోగ్య సంక్షేమ మంత్రిత్వ శాఖ నుండి ఐఏఎస్ అధికారులు విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా పట్టణంలోని డ్రైవర్స్ కాలనీ పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఆరాధనా పట్నాయక్ సందర్శించారు. యుపీహెచ్‌సీలో 12 రకాల విభాగాలలో అందుతున్న సేవలు, వాటి కంప్యూటరీకరణ, రికార్డులలో ఏవిధంగా నిక్షిప్తం చేస్తున్నది.. ప్రతి విభాగాన్ని క్షుణ్ణంగా పరిశీలించి స్థానిక వైద్యాధికారి డాక్టర్ మానసను అడిగి తెలుసుకున్నారు. పరిశీలన అనంతరం బృంద సభ్యులు ఎన్‌హెచ్‌ఏం రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ విజయలక్ష్మి, హెచ్‌డబ్ల్యూసీ రాష్ట్ర నోడల్ అధికారి శ్యామల, స్టేట్ ఇమ్యునైజేషన్ ఆఫీసర్ దేవి, డీపీఎంవోట డాక్టర్ రత్నమన్‌మోహన్, డీపీవో సైమన్, ఆర్కేఎస్‌కే స్టేట్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నిర్మలాగ్లోరిలు సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రత్నమోహన్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ గురుకుమార్, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీమన్నారాయణ, హెచ్‌వీ రమాదేవి, యూపీహెచ్‌సీ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బాపట్ల టౌన్‌హాలుకు 119 వసంతాలు



బాపట్ల పట్టణంలోని టౌన్‌హాలు

బాపట్ల, జూలై 16: చారిత్రాత్మకమైన బాపట్లటౌన్‌హాలు నిర్మించి 119 సంవత్సరాలు పూర్తైంది. 1905 జూలై 17న అప్పటి జిల్లా కలెక్టర్ బ్రాడీ దీనిని ప్రారంభోత్సవం చేశారు. ప్రభుత్వ ఆర్థికసహాయం లేకుండా ప్రజల విరాళాలతో టౌన్‌హాలు నిర్మించారు. ఇంగ్లాండ్‌లో పట్టాభిషిక్తుడవుతున్న అప్పటి భారత చక్రవర్తి ఎడ్వర్డ్ గౌరవార్థంగా దీనికి ఎడ్వర్డ్ పట్టాభిషేక స్మారకటౌన్‌హాలుగా నామకరణ చేశారు. రాజకీయ, సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలకు ఈ టౌన్‌హాలు పట్టుగొమ్మగా నిలిచింది. సర్వకళల కేంద్రంగా, బాపట్ల జీవనాడిగా విరాజిల్లింది. జాతిపిత మహాత్మాగాంధీ, జవహర్‌లాల్‌నెహ్రూ, డాక్టర్ బాబురాజేంద్రప్రసాద్ వంటి ఎందరో జాతీయ నాయకులు ఇక్కడ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. 1913 మే నెలలో జరిగిన ప్రథమాంధ్ర మహాసభకు టౌన్‌హాలు వేదికగా నిలిచింది. తెలుగు ప్రజల స్వరాష్ట్ర వాంఛకు టౌన్‌హాలు ముత్యాలపందిరి వేసింది. బాపట్లలో టౌన్‌హాలు నిర్మించాలని 1902 డిసెంబరు 5న జరిగిన ఒక సమావేశంలో నిర్ణయించారు. అప్పటి బాపట్ల తహసీల్దార్ కె.శేషాచలపతిపంతులు ఆధ్వర్యంలో అధికారులు, న్యాయవాదులతో ఒక పట్టాభిషేక స్మారకకమిటీ ఏర్పాటైంది. అప్పటి బాపట్ల తాలూకా మిరాశీదారుగా ఉన్న జాగర్లమూడి నాయుడు ఆధ్వర్యంలో గ్రామగ్రామం తిరిగి టౌన్‌హాలు నిర్మాణానికి విరాళాలు సేకరించారు. జమ్ములపాలెం మిరాశీదారు కుర్రా ముత్తయ్యచౌదరి, న్యాయవాదులు దేశిరాజు కృష్ణయ్యపంతులు, చేరగూడి వెంకటాద్రిపంతులు టౌన్‌హాలు నిర్మాణానికి స్థలం ఇవ్వటానికి ముందుకొచ్చారు.

మంత్రి అచ్చెన్నాయుడిని కలిసిన పీఏసీఎస్ యూనియన్ సభ్యులు



మంత్రి అచ్చెన్నాయుడికి మెమోరాండం అందజేస్తున్న జిల్లా సహకార సంఘ నాయకులు

ప్రత్తిపాడు, జూలై 16: జిల్లా ప్రాథమిక సహకార సంఘాల ఉద్యోగుల అసోసియేషన్ ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడు ముప్పా వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి వైవీ నారాయణ, వర్కింగ్ ప్రసిడెంట్ దొప్పలపూడి శ్రీనివాసరావులు సహకార శాఖా మంత్రి అచ్చెన్నాయుడిని మంగళవారం కలుసుకున్నారు. అమరావతిలోని సచివాలయంలో మంత్రి అచ్చెన్నాయుడి ఛాంబర్‌లో ఆయన్ను కలుసుకుని సహకార సంఘ ఉద్యోగులు కోర్కెలు తీర్చాలని వేడుకున్నారు. దీనికి సంబంధించి మెమోరాండాన్ని మంత్రికి అందజేశారు. రాష్ట్రంలో 2051 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలలో ఏడు వేలకు పైగా ఉద్యోగులు వివిధ హోదాలలో విధులు నిర్వహిస్తూ రైతులకు సేవలు అందిస్తున్నారని వారు తెలిపారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో సహకార ఉద్యోగులకు దేశంలోనే తొలిసారి 2016లో మానవ వనరుల విధానం అమలుపై ఒక కమిటీని నియమించి జీవో నెంబరు 36 రూపంలో పూర్తిస్థాయిలో అమలు చేస్తూ ఉద్యోగులకు భద్రత కల్పించడం జరిగిందన్నారు. అయితే గత వైసీపీ ప్రభుత్వం 36 జీవోను సవరణ చేస్తూ, అందులోని కొన్ని అంశాలను రద్దు చేసి 2020లో జీవో నెంబరు 90 విడుదల చేయడం జరిగిందని, అవి ఇంతవరకు పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోలేదని మంత్రికి వివరించారు. అంతేకాకుండా 2014 నుండి జరగాల్సిన వేతన సవరణ 2024 వరకు కూడా అమలుకు నోచుకోలేదన్నారు. ఉద్యోగుల భద్రతకు సంబంధించి పలు విషయాలను మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకురావడంతో పాటు ఈ ప్రభుత్వం ఉద్యోగులకు కల్పించాల్సి భద్రతను వివరిస్తూ మెమోరాండం అందజేశారు. సానుకూలంగా స్పందించిన మంత్రి అచ్చెన్నాయుడు.. వీటిని పరిశీలించి త్వరలోనే సహకార సంఘ ఉద్యోగులకు తగు న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

గుంటూరు మీదగా నాలుగు రైళ్ల దారి మళ్లింపు

గుంటూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): విజయవాడ - గూడూరు మధ్యన మూడో రైలుమార్గం నిర్మాణ పనుల కారణంగా నాలుగు రైళ్లను గుంటూరు మీదగా మళ్లిస్తున్నట్లు సదరన్ రైల్వే మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. నెంబరు. 22878 ఎర్నాకుళం - హౌరా అంత్యోదయ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 22, 29 తేదీల్లో రేణిగుంట, యర్రగుంట్ల, నంద్యాల, గుంటూరు మీదగా విజయవాడకు చేరుకొని అక్కడి నుంచి రెగ్యులర్ మార్గంలో ప్రయాణిస్తుంది. నెంబరు.22841 సంత్రగచి జంక్షన్ - తాంబరం ఎక్స్‌ప్రెస్ ఈ నెల 22, 29 తేదీల్లో విజయవాడ నుంచి తెనాలి మార్గంలో కాకుండా గుంటూరు, నంద్యాల, యర్రగుంట్ల, రేణిగుంట, చెన్నై ఎగ్మోర్ మీదగా తాంబరం చేరుకొంటుంది. నెంబరు. 22863 హౌరా - ఎస్ఎంవీటీ బెంగళూరు ఏసీ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 22న గుంటూరు, నంద్యాల, యర్రగుంట్ల, రేణిగుంట మీదగా ప్రయాణిస్తుంది. నెంబరు. 12651 మదురై - నిజాముద్దీన్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 23, 30 తేదీల్లో చెన్నై ఎగ్మోర్, రేణిగుంట, యర్రగుంట్ల, నంద్యాల, గుంటూరు మీదగా విజయవాడకు చేరుకొని అక్కడి నుంచి రెగ్యులర్ రూట్‌లో ప్రయాణిస్తుంది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.55
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	111, 119,130
చికెన్ విత్ స్కిన్	210.00
చికెన్ స్కిన్ లెస్	220.00

పల్నాడు జిల్లాలో 10మంది సీఐలకు పోస్టింగ్

గుంటూరు, జూలై 16: పల్నాడు జిల్లాలో పదిమంది సీఐలకు పోస్టింగ్స్ ఇస్తూ రేంజ్ ఐజీ ఎస్ఎస్ త్రిపాఠి మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ఎన్నికల అనంతరం కొత్త ప్రభుత్వం ఏర్పాటైన తరువాత ఉన్నతాధికారులు సీఐల బదిలీలపై దృష్టి సారించారు. ఆయా ప్రజా ప్రతినిధుల సిఫార్సులతో పాటు వారి ట్రాక్ రికార్డును పరిశీలించి బదిలీల ప్రక్రియ చేపట్టారు. పోస్టింగ్స్ పొందిన సీఐ వివరాలు ఇలా ఉన్నాయి.

1. ఎం.విజయచరణ్, సోషల్‌మీడియా అండ్ సైబర్‌క్రైమ్ సెల్ పల్నాడు నుంచి నరసరావుపేట వన్ టౌన్‌కు
2. ఎస్.సాంబశివరావు, వినుకొండటౌన్‌నుంచి నరసరావుపేటటూటౌన్‌కు
3. యు.శోభన్‌బాబు, పల్నాడుస్పెషల్‌బ్రాంచ్-2నుంచి వినుకొండ టౌన్‌కు
4. పసుపులేటి రామకృష్ణ, వేమూరుసర్కిల్ నుంచి నర్సరావుపేట రూరల్ సర్కిల్‌కు
5. బి.ప్రభాకర్, తుళ్లూరు ట్రాఫిక్-2నుంచి వినుకొండ రూరల్ సర్కిల్‌కు
6. బీ సుబ్బానాయుడు, పల్నాడు ఎస్సీ, ఎస్టీ సెల్ నుంచి చిలకలూరిపేట రూరల్ సర్కిల్‌కు
7. కే వెంకటప్రసాద్, స్పెషల్ బ్రాంచ్-3 నుంచి అచ్చంపేట పీఎస్‌కు
8. ప్రత్తిపాటి సురేష్, రేంజ్‌వీఆర్ గుంటూరు నుంచి పెదకూరపాడు సర్కిల్‌కు
9. ఎం.సుబ్రహ్మణ్యం, రాపూరుసర్కిల్, నెల్లూరు నుంచి సత్తెనపల్లి టౌన్‌కి
10. పోలూరి శ్రీనివాస్, సత్తెనపల్లి టౌన్ నుంచి సత్తెనపల్లి రూరల్‌కి..

పెదరావూరు ఆలయంలో అర్ధరాత్రి చోరీ..!

- సుమారు రూ.లక్ష విలువైన అమ్మవారి నగల అపహరణ

తెనాలి రూరల్, జూలై 16: మండలంలోని పెదరావూరులో కొలువుదీరిన శ్రీభ్రమరాంబ సమేత శ్రీమల్లేశ్వరస్వామి ఆలయంలో చోరీ జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. పెదరావూరులోని శ్రీభ్రమరాంబసమేత శ్రీమల్లేశ్వరస్వామి ఆలయంలో సోమవారం అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఆలయంలోకి ప్రవేశించారు. స్వామివార్లకు వేర్వేరుగా రెండు గర్భగుడులు ఉండటంతో రెండు తాళాలు ధ్వసం చేశారు. అమ్మవారి విగ్రహానికి అలంకరించిన వెండి, బంగారు నగలను చోరీ చేశారు. స్వామివారి నగలు మూటకట్టి తీసుకువెళ్లేందుకు ప్రయత్నించగా అవి బరువుగా ఉండటంతో మూట ఆలయప్రాంతంలో వదిలేశారు. ఆలయంలో ఏర్పాటుచేసిన సీసీ కెమెరాల డీవీఆర్‌ను సైతం చోరీ చేశారు. చోరీ జరుగుతున్న సమయంలో కొందరు యువకులు ఆలయం ద్వారాలు తెరచి ఉండటాన్ని గమనించి గ్రామస్తులను మేల్కొపారు. వారు రావడాన్ని గమనించిన దొంగలు నగలతో పారిపోయారు. గతంలో కూడా ఈ ఆలయంలో చోరీకి ప్రయత్నించగా గ్రామస్తులు వెంబడించడంతో పారిపోయారు. సుమారు రూ.1లక్ష విలువైన నగలు అపహరణకు గురైనట్లు ఆలయ ఈవో శ్యాంసుందర్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కోటేశ్వరరావు తెలిపారు. క్లూస్‌టీం సహాయంతో వివరాలు సేకరిస్తున్నారు.

36,277 టిక్కీల మిర్చి అమ్మకం

గుంటూరు, జూలై 16(ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 37,622 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 36,277 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్‌కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డులో 16,875 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	800016000		334	9000	15500
నెంబరు. 5	8500	16000	నెంబరు. 5	8500	14000
273	11000	13500	273	–	–
341	8500	16500	341	11000	15500
4884	–	–	4884	15500	16200
సూపర్ 10	–	–	సూపర్ 10	–	–
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	8500	18500	తేజ	8800	18000
బ్యాడిగి	9000	16000	బ్యాడిగి	9000	15000
దేవనూరుడీలక్స్	9000	15000	దేవనూరుడీలక్స్	–	–
తెల్లకాయలు	4000	12000	తెల్లకాయలు	5000	11000

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె


ప్రమాదాల నివారణపై జిల్లా స్థాయి కమిటీతో సమావేశమైన కలెక్టర్ జె.వెంకటమురళీ

పరిశ్రమలలో ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి

● కలెక్టర్ జె.వెంకటమురళీ

బాపట్ల, జూలై 16 : పరిశ్రమలలో ప్రమాదాలు, ప్రాణనష్టం జరగకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ జె.వెంకటమురళీ ఆదేశించారు. ఫ్యాక్టరీలలో ప్రమాదాల నివారణపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. సమావేశానికి కలెక్టర్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ జిల్లాలోని ప్రధాన ఫ్యాక్టరీలను అధికారులు తనిఖీ చేసి నివేదిక పంపాలన్నారు. విజయవాడలోని ఆల్ట్రాటెక్ ఫ్యాక్టరీలో ప్రమాదం జరగటంతో ప్రభుత్వం అప్రమత్తమైందన్నారు. ఫ్యాక్టరీల భద్రతపై తనిఖీ చేయాలని జీవోనెంబరు 79ని విడుదల చేసిందన్నారు. ఈమేరకు జిల్లాలో కాటన్, ఆక్వా, మిర్చి ప్రాసెసింగ్ చేసే తదితర ఫ్యాక్టరీలలో అమోనియం వినియోగించే ఫ్యాక్టరీలు 19 ఉన్నట్లు గుర్తించామన్నారు. ప్రజలకు నష్టం జరగకుండా వాటిని తనిఖీలు చేసి భద్రతపై నివేదిక పంపాలన్నారు. ఏ ఫ్యాక్టరీలోను ప్రాణహాని జరగరాదని హెచ్చరించారు. ప్రమాద సంఘటనలకు తావుఇవ్వరాదన్నారు. చట్టం పరిధిలోనే ప్రతి అధికారి పని చేయాల్సి ఉందన్నారు. 15రోజులలో తనిఖీలు చేసి సమగ్రనివేదికను సమర్పించాలన్నారు. నిబంధనల ప్రకారం ఫ్యాక్టరీల ఏర్పాటు, నిర్వాహణ ఉందా లేదా అనే అంశాలు పరిశీలించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే తక్షణమే చర్యలు ఉంటాయన్నారు. ప్రమాదాలకు కారకాలు, నిర్లిప్తత, రక్షణచర్యలు లేకపోతే నివేదికలో స్పష్టంగా పొందుపర్చాలన్నారు. ముందుగా ప్రమాదాలు పసిగట్టి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై యాజమాన్యానికి, సాంకేతిక నిపుణులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ జీవోను అనుసరించి జిల్లాలోని ఫ్యాక్టరీలన్నింటిని ప్రతి మూడునెలలకు ఒకసారి తనిఖీలు చేయాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ బి.సుబ్బారావు, పరిశ్రమల శాఖ జీఎం వై.కృష్ణ, పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ ఆఫ్ చీఫ్ జి.రాఘవరెడ్డి, ఫ్యాక్టరీస్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ పరమేశ్వరరావు, శ్రీనివాసులు, గీత, కార్మికశాఖ సహాయ కమిషనర్ వెంకటశివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీలలో సిల్ట్ తొలగింపునకు చర్యలు

బాపట్ల, జూలై 16 : 'డ్రైనేజీలు ఇలా.. మురుగు పారేది ఎలా?' అంటూ 'ఆంధ్రజ్యోతి'లో వెలువడిన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్ ఆధ్వర్యంలో జేసీబీ ఏర్పాటు చేసి సూర్యలంకరోడ్డులోని డ్రైనేజీలలో పేరుకుపోయిన సిల్ట్ తొలిగించే పనులకు మంగళవారం శ్రీకారం చుట్టారు. డ్రైనేజీలు మొత్తం సిల్ట్ తొలిగించి మురుగురోడ్ల మీదకు రాకుండా చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు. మెయిన్ డ్రెయిన్లతోపాటు మిగిలిన డ్రెయిన్‌లు కూడా శుభ్రం చేయించే విధంగా చర్యలు చేపడుతామన్నారు. స్పెషల్‌డ్రైవ్ పెట్టి సీజనల్‌వ్యాధులు రాకుండా శానిటేషన్ పనులు ముమ్మరం చేస్తామన్నారు. సిల్ట్ తొలగింపు పనులను ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ పరిశీలించి మున్సిపల్ అధికారులకు పలుసూచనలు చేశారు. అనంతరం మూడో వార్డు రాజీవ్‌గాంధీకాలనీలోని శ్మశానవాటికలో కోటి 50 లక్షల రూపాయలతో నిర్మిస్తున్న క్రిమిటోరియంను కమిషనర్ పరిశీలించారు. శీలంవారిపాలెంలో రోడ్లపైకి వచ్చిన నీటిని పరిశీలించి మున్సిపల్ అధికారులకు కమిషనర్ పలు సూచనలు చేశారు. సమస్య లేకుండా సత్వర చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ కె.శ్రీనివాసులు, ఏఈ ఉమామహేశ్వరరావు, శానిటరి ఇన్‌స్పెక్టర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


పూడిపోయిన డెయిన్‌లను ఎక్స్‌కవేటర్‌తో తవ్వుతున్న చిత్రం

నల్లమడ రైతుల సమస్యలు పరిష్కరించాలి

● రైతు సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొల్లా

బాపట్ల, జూలై 16 : ప్రభుత్వాలు మారిన, పాలకులు మారిన నల్లమడ రైతుల సమస్యలు మాత్రం పరిష్కారానికి నోచుకోవటంలేదని నల్లమడ రైతు సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొల్లా రాజమోహనరావు అన్నారు. మండలంలోని చెరువుజమ్ములపాలెం గ్రామంలో మంగళవారం నల్లమడ రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. కాపు వెంకటకమలాకరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజమోహనరావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ గుంటూరు ఛానల్ పర్చూరు వరకు పొడిగించాలని, నల్లమడ డ్రెయిన్ అభివృద్ధి చేయాలని 8 దశాబ్దాలుగా పెదనందిపాడు, పర్చూరు ప్రాంత ప్రజలు ఆందోళన చేస్తున్నట్లు తెలిపారు. ముగ్గురు ముఖ్యమంత్రుల వాగ్దానాలు, అసెంబ్లీ ప్రకటనలు ఆచరణకు నోచుకోలేదన్నారు. పైగా ఆందోళన చేస్తున్న రైతులపై గత ప్రభుత్వం కేసులు నమోదు చేసిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నిధులు కేటాయించాలని కోరారు. సమావేశంలో ప్రొఫెసర్ విజయ్‌కుమార్, మానం విజేత, వైఏ చౌదరి, కామేపల్లి కృషిబాబు, గండికోట సుబ్బయ్య, పువ్వాడ బసంత్‌కుమార్, పంగులూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న నల్లమడ రైతు సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొల్లా రాజమోహనరావు

19 మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

కర్లపాలెం, జూలై 16 : మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ యారం వనజ అధ్యక్షతన ఈనెల 19న మధ్యాహ్నం 2 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతుందని, మండలంలోని ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, అన్నిశాఖల అధికారులు హాజరుకావాలని ఎంపీడీవో నేతాజి తెలిపారు.

అన్న క్యాంటీన్ మరమ్మతులు వెంటనే పూర్తి చేయాలి

● ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

● ఆగస్టు 15న క్యాంటీన్ ప్రారంభం

బాపట్ల, జూలై 16 : అన్న క్యాంటీన్ భవనానికి త్వరితగతిన మరమ్మతులు చేయించాలని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్, సిబ్బంది, పార్టీ శ్రేణులతో కలిసి మంగళవారం అన్న క్యాంటీన్ భవనాన్ని ఆయన పరిశీలించారు. సూర్యలంకరోడ్డులో ఉన్న ఈ క్యాంటీన్ మరమ్మతులను నెలాఖరు నాటికి పూర్తి చేయాలన్నారు. దెబ్బతిన్న పైపులు, సామగ్రి, వస్తువులకు మరమ్మతులు చేయించి రంగులు వేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని చెప్పారు. ఆగస్టు 15వ తేదీన క్యాంటీన్ ప్రారంభించి పేద ప్రజలకు అతి తక్కువ ధరకే నాణ్యమైన ఆహారం అందించటం జరుగుతుందన్నారు. మున్సిపల్ అధికారులకు వివిధ సూచనలు చేశారు. అనంతరం పట్టణంలోని పలు సమస్యలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ కె.శ్రీనివాసులు, ఏఈ ఉమామహేశ్వరరావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు కావూరి శ్రీనివాసరెడ్డి, మాజీ కౌన్సిలర్లు నాగరాజు, కె.రమేష్, సీనియర్ నాయకులు మందపాటి ఆంధ్రేయ, పరీద్ మస్తాన్, కర్పూరపు రామారావు, దారా అశోక్, శేఖర్, సాంబశివరావు, శీలం శ్రీను తదితరులు పాల్గొన్నారు.


అన్నక్యాంటీన్ భవనసముదాయాన్ని పరిశీలించి పలుసూచనలు చేస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ

సమ్మర్‌స్టోరేజి ట్యాంక్‌ను పూర్తి స్థాయి నీటితో నింపాలి

పట్టణ ప్రజలకు తాగునీటిని అందించే సమ్మర్ స్టోరేజి ట్యాంక్‌ను పూర్తి స్థాయి నీటితో నింపాలని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్, మున్సిపల్ అధికారులు, నాయకులతో కలిసి మంగళవారం ఆయన ఎస్‌ఎస్ ట్యాంక్‌ను పరిశీలించారు. ట్యాంక్‌లో ప్రస్తుతం 12 అడుగుల నీటి పరిమాణం ఉందని తెలిపారు. 40 హెచ్‌పి మోటర్లు రెండు, 10 హెచ్‌పీ మోటర్లు 8 ఉన్నాయని, వీటి ద్వారా పిటి ఛానల్‌లో నీరు చెరువులోకి డంప్ చేస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. ఇంకా 40 హెచ్‌పీ మోటర్లు 3 తీసుకొచ్చి ఏర్పాటు చేస్తామన్నారు. మొత్తం సామర్థ్యంతో చెరువును త్వరితగతిన నింపాలని ఎమ్మెల్యే తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డీఈ కె.శ్రీనివాసులు, ఏఈ ఉమామహేశ్వరరావు, టీడీపీ పట్టణ అధ్యక్షులు గొలపల శ్రీనివాసరావు, పార్టీ మండల మాజీ అధ్యక్షులు కావూరి శ్రీనివాసరెడ్డి, మాజీ కౌన్సిలర్లు నాగరాజు, కె.రమేష్, సీనియర్ నాయకులు మందపాటి ఆంధ్రేయ, ఫరీద్ మస్తాన్, కర్పూరపు రామారావు, దారా అశోక్, శేఖర్, సాంబశివరావు, శీలం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు దరఖాస్తు చేసుకోవాలి : డీఈవో

బాపట్ల, జూలై 16 : జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు అర్హులైన ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జి డీఈవో జి.వెంకటేశ్వర్లు తెలిపారు. 2024వ సంవత్సరానికి జిల్లాలోని మండల విద్యాశాఖాధికారులు, ఉప విద్యాశాఖాధికారుల ద్వారా ఈనెల 18వ తేదీలోపు దరఖాస్తు చేసుకునే అవకాశం మరొకసారి కల్పించటం జరుగుతుందన్నారు. ఆన్‌లైన్ ద్వారా వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

కలెక్టర్‌ను సత్కరించిన వ్యవసాయాధికారుల బృందం

బాపట్ల, జూలై 16 : ఆంధ్రప్రదేశ్ వ్యవసాయాధికారుల సంఘం బాపట్ల జిల్లా నాయకులు మంగళవారం కలెక్టర్ జె.వెంకటమురళీని మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా వ్యవసాయాధికారి వై.రామకృష్ణ ఆధ్వర్యంలో కలెక్టర్‌ను ఘనంగా సత్కరించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కె.ధనరాజు, కోశాధికారి ఉయ్యూరి లోకేశ్వరి, ఉపాధ్యక్షుడు ఆర్.విజయబాబు, వ్యవసాయాధికారులు ఎ.లక్ష్మీ, కె.శారద, చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.


కలెక్టర్ వెంకటమురళీని సన్మానిస్తున్న వ్యవసాయశాఖ జేడీ వై.రామకృష్ణ, జిల్లాలోని వ్యవసాయాధికారులు

అర్చకుల సమస్యలను పరిష్కరించాలి

పిట్టలవానిపాలెం, జూలై 16 : దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని బాపట్ల జిల్లా అర్చక సేవా సంఘం ప్రధాన కార్యదర్శి బృందావనం గోపిచంద్ మంగళగిరి సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి అర్చకుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి రామనారాయణరెడ్డి సానుకూలంగా స్పందించారు. అర్చకులకు దేవాలయాలలో ధూప, దీప నైవైద్యం పథకంపై తొలిసంతకం చేయటంపై హర్షిస్తూ బాపట్ల జిల్లా అర్చక సేవా సంఘం ప్రధాన కార్యదర్శి బృందావనం గోపిచంద్ మంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పూలబోకెతో, దుశ్శాలువాతో మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని ఘనంగా సత్కరించారు.


మంత్రి రామనారాయణరెడ్డిని ఘనంగా సత్కరిస్తున్న బృందావనం గోపిచంద్

తొలి ఏకాదశిని ప్రతి ఒక్కరూ జరుపుకోవాలి

భట్టిప్రోలు, జూలై 16 : పరమ పవిత్రమైన తొలి ఏకాదశి పండుగను ప్రతి ఒక్కరూ జరుపుకోవాలని జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు అన్నారు. మండలంలోని ఐలవరం వేణుగోపాల స్వామి దేవస్థానంలో మంగళవారం తొలి ఏకాదశి పర్వదినంను పురస్కరించుకుని ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. సంవత్సరంలో తొలి పండుగగా జరుపుకునే తొలి ఏకాదశి పండుగ అని తెలియజేశారు. మనందరికి పేలాల పిండి పండుగగా జరుపుకుంటూ స్వామివారికి పేలపిండిని ప్రసాదంగా సమర్పించాలని శంకరరావు వివరించారు.

అగ్ని బాధితులకు ఇండియన్ రెడ్‌క్రాస్ చేయూత

కర్లపాలెం, జూలై 16 : మండలంలోని దిండువారిపాలెం పంచాయతీ అక్కిరాజు దిబ్బకాలనీలో అగ్నిప్రమాదంలో సర్వంకోల్పోయిన జ్యోతి కుటుంబానికి ఇండియన్ రెడ్‌క్రాస్ తరుపున మంగళవారం తాత్కాలిక గూడారానికి పట్టా, వంట సామగ్రిని సొసైటీ చైర్మన్ ఇ.పోలీసురావు సభ్యులతో బాధితులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బాధితులు ఏసు, జ్యోతి, రెడ్‌క్రాస్ సభ్యులు ఓ.భద్య, జి.వెంకటరెడ్డి, బి.జీవనజ్యోతి తదితరులు పాల్గొన్నారు.


అగ్నిబాధితులకు రెడ్‌క్రాస్ కిట్ అందజేస్తున్న చైర్మన్ పోలీసురావు

కర్లపాలెంలో దోమల నివారణకు ఫాగింగ్

కర్లపాలెం,జులై 16 : దోమలను నివారించేందుకు సర్పంచ్ లలిత కుమారి ఆధ్వర్యంలో కార్యదర్శి మోడీ శ్రీనివాసరావు మంగళవారం కర్లపాలెంలో ఫాగింగ్ చేయించారు. పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కర్లపాలెంలో సిమెంట్‌రోడ్డుపై నిలిచిన వర్షపునీరు

కర్లపాలెం,జులై 16 : కర్లపాలెం పంచాయతీ పరిధిలో మూడురోజులుగా ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలు కారణంగా పంచాయతీ పరిధిలోని అంతర్గత సిమెంట్ రోడ్లు నీటితో మునిగిపోయి వర్షపునీరు పచ్చగా మారిపోయాయి. వర్షపు నీటిలో దోమలు వృద్ధి చెందుతాయని ప్రజానీకం ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి రహదార్లకు ఇరువైపుల శాశ్వత డ్రెయిన్‌లను ఏర్పాటు చేయాలని కర్లపాలెం పంచాయతీ ప్రజలు కోరుతున్నారు.


సిమెంట్ రోడ్డుపై పచ్చగా మారిన వర్షపు నీరు


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో శేషగిరిరావు

పారిశుధ్య చర్యలపై దృష్టి సారించాలి : ఎంపీడీవో

వేమూరు, జూలై 16 : గ్రామాల్లో పారిశుధ్య చర్యలపై కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో శేషగిరిరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పీఆర్‌వన్ యాప్‌కు సంబంధించిన రిజిస్ట్రేషన్‌పై అవగాహన కల్పించారు. ముఖ్యంగా వర్షాకాలంలో అంటు వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పారిశుధ్యంపై దృష్టి పెట్టాలని, మురుగునీటి పారుదల, పేరుకుపోయిన చెత్తను తొలగించడంతో పాటు ఖాళీ స్థలాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. మైకు ప్రచారం ద్వారా గృహాల్లో ఉన్న ప్లాస్టిక్ సీసాలు, పాత సామాన్లు, కొబ్బరి బొండాలు లాంటి వస్తువులను తొలగించాలని, అలాగే పరిశుభ్ర వాతావరణాన్ని నెలకొల్పేందుకు చర్యలు తీసుకునే విధంగా ప్రచారం చేయాలన్నారు. ప్రతి శుక్రవారం శానిటేషన్ డేని పాటించాలన్నారు. సమావేశంలో ఈవోపీఆర్‌డీ శేఖర్, 17 గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులు, అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలి

● బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

పిట్టలవానిపాలెం, జూలై 16 : రాజకీయాలు ఎన్నికల వరకు పరిమితం అవ్వాలని నియోజకవర్గ, మండల, గ్రామస్థాయిలో అధికారులు, ప్రజాప్రతిప్రతినిధులు ప్రజలకు బాధ్యతాయుతంగా పని చేయాలని బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. మండలంలోని మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశానికి మంగళవారం ముఖ్య అతిగా పాల్గొన్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ మాట్లాడుతూ మండలంలోని అన్నిస్థాయిల అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజాసంక్షేమాన్ని కాంక్షిస్తూ ప్రజల అభివృద్ధికి దోహదపడాలన్నారు. సమావేశంలో మండల స్థాయి అధికారులు పలు అంశాలపై మాట్లాడారు. వివిధ శాఖల అధికారులతో మండలంలో జరగాల్సిన అభివృద్ధి పనులపై నరేంద్రవర్మ సమీక్ష నిర్వహించారు. గ్రామాలలో తాగు, సాగునీరు, విద్య, వైద్యం, విద్యుత్ సరఫరా, పారిశుధ్యంపై మరింత దృష్టిపెట్టాలని అధికారులకు సూచించారు. అధికారులు బాధ్యతాయుతంగా పని చేయాలని లేకుంటే తమ గమ్యస్థానాలకు వెళ్ళాలన్నారు. ప్రజాప్రతినిధిగా ఎన్నికైన నూతనంగా మండలపరిషత్ కార్యాలయానికి విచ్చేసిన నరేంద్రవర్మను ఆయా శాఖల అధికారులు దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. సమావేశానికి ఇన్‌చార్జి ఎంపీపీ దెందుకూరి సీతారామరాజు అధ్యక్షత వహించారు. సమావేశంలో ఎంపీడీవో బీవీ రమణమూర్తి, తహసీల్దార్ కె.సూర్తి, ఉప ఎంపీపీ చేబ్రోలు కృపానందం, ఇన్‌చార్జి ఉప ఎంపీపీ సిందు, ఆయా గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఆయా పంచాయతీల కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు, కూటమి నాయకులు, వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

వాతావరణ సమతుల్యతకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

● బాపట్ల సమగ్రశిక్ష ఏపీసీ డిప్యూటీ కలెక్టర్ ఎంవీ సుధాకర్

బాపట్ల రూరల్, జూలై 16 : పర్యావరణ పరిరక్షణకు, వాతావరణ సమతుల్యతకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని బాపట్ల సమగ్ర శిక్ష ఏపీసీ డిప్యూటీ కలెక్టర్ ఎంవీ సుధాకర్ సూచించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన అమ్మపేరిట మొక్క కార్యక్రమంలో భాగంగా బాపట్ల సమగ్రశిక్ష ఆవరణలో మంగళవారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అమ్మపేరిట మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా ఆయా పాఠశాలలకు సమగ్ర శిక్ష వారి ద్వారా జామ, ఉసిరి, నేరెడు తదితర మొక్కలు పంపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బాపట్ల సమగ్ర శిక్ష ఏఎంఓ డాక్టర్ బి.మోసిస్, ఈఈ ఏ.నాగజ్యోతి, సీఎంఓ శ్రీనివాస్, ఎఎస్‌వో శ్రీనివాస్, బాపట్ల, కర్లపాలెం చీరాల సీఆర్‌ఎంటీలు, బాపట్ల సమగ్ర శిక్ష కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాల ఉత్పత్తి దారులకు అండగా సంగం డెయిరీ

● డైరెక్టర్ లక్ష్మీజ్ఞానానంద భగవాన్

వేమూరు, జూలై 16 : సంగం డెయిరీ పరిధిలోని పాల ఉత్పత్తిదారులకు ఆర్థికంగా, సంక్షేమపరంగా పాలకవర్గం పని చేస్తోందని, ఎంతో అండగా ఉంటోందని డెయిరీ డైరెక్టర్ గుత్తికొండ లక్ష్మీజ్ఞానానంద భగవాన్ అన్నారు. మండలంలోని అబ్బనగూడవల్లి గ్రామంలో మంగళవారం 44 మంది పాల ఉత్పత్తిదారులకు రూ.82 వేల బోనస్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భగవాన్ మాట్లాడుతూ డెయిరీకి పాలు సరఫరా చేస్తున్న రైతులకు ఉచిత వైద్య సౌకర్యాలు కల్పించడంతో పాటు పాడి గేదెలకు ఉచితంగా పశు వైద్యం, బీమా సౌకర్యాలను కల్పించి ఎంతగానో అండగా నిలుస్తోందన్నారు. ఇందుకు డైయిరీ చైర్మన్, పొన్నూరు ఎమ్మెల్యే దూళిపాళ నరేంద్రకుమార్ చూపుతున్న శ్రద్ధ అభినందనీయమన్నారు. డెయిరీ ద్వారా అనేక ఉత్పత్తులను మార్కెట్‌లోకి తీసుకువచ్చి వ్యాపార రంగంలో ఆర్థిక పరంగా ఎంతో మంది నిరుద్యోగులకు సహకరిస్తోందన్నారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు లావు రామారావు, కార్యదర్శి కోటి నాగయ్య, రైతులు, డెయిరీ సిబ్బంది పాల్గొన్నారు.

చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

చెరుకుపల్లి, జూలై 16 : చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించే విధంగా చొరవ చూపాలని టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు దివి రాంబాబు మంగళవారం చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్.సవితకు పలు సమస్యలతో కూడినపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం చేనేత కార్మికులను పట్టించుకోలేదన్నారు. ప్రభుత్వం వెంటనే చేనేతపై జీఎస్టీని ఎత్తివేయాలన్నారు. రాష్ట్రంలో ఉన్న చేనేత సహకార సంఘాల క్యాష్‌క్రెడిట్, రుణమాఫీ చేయాలని ఆమెను కోరామని చెప్పారు. ఆప్కో సంఘాలకు ఇవ్వాల్సిన బకాయిలను వెంటనే ఇవ్వాలని కోరారు. చేనేత సంఘాలకు పావలా వడ్డీని పునరుద్ధరించాలన్నారు. చేనేత వస్త్రాలపై 20 శాతం డిబేట్‌ను అన్ని పండుగులకు ఇవ్వాలని అన్నారు. 2017 ఆగస్టు నెలలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించిన యారన్ సబ్సిడీ 40 శాతంను పునరుద్ధరిస్తూ గత ఐదు సంవత్సరాల బకాయిలు విడుదల చేయాలన్నారు. నూలు రసాయనాల రేట్లు తగ్గించాలని, చేనేత కార్మికులకు హెల్త్ స్కీమ్‌ను పునరుద్ధరించాలని, చేనేత రంగానికి బడ్జెట్‌లో రూ.500 కోట్లు ఇవ్వాలన్నారు. నేతన్న నేస్తం రాష్ట్రంలో ఉన్న గణాంకాల ప్రకారం 3 లక్షల చేనేత కార్మికులకు అందే విధంగా చర్యలు తీసుకోవాలని మంత్రికి విన్నవించామన్నారు.


చేనేత సమస్యలపై నివేదికను మంత్రి ఎస్.సవితకు అందిస్తున్న రాంబాబు

నాపై హత్యాయత్నానికి వైసీపీ వ్యూహ రచన

● టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సాయిబాబా ఆరోపణ

భట్టిప్రోలు, జూలై 16 : తనను హత్య చేసేందుకు వైసీపీ నాయకుడు వరికూటి అశోక్‌బాబు, అతని అనుచరులు వ్యూహరచన చేస్తున్నారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా ఆరోపించారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత 5 సంవత్సరాల పాలనలో వైసీపీ ప్రభుత్వం అనుసరించిన ప్రజా వ్యతిరేక విధానాలను పత్రికల ద్వారా ఎండగడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో మాజీ మంత్రి మేరుగ నాగార్జున వ్యవహరించిన నిర్లక్ష్యంపై పోరుబాట కార్యక్రమం ద్వారా ప్రజల్ని చైతన్యపరచడాన్ని జీర్ణించుకోలేని వైసీపీ నాయకులు కుట్రలు చేస్తున్నారన్నారు. వేమూరు నుంచి వైసీపీ తరపున పోటీ చేసి ఓడిపోయిన వరికూటి అశోక్‌బాబు, అతని సోదరుడు అమృతపాణి, అతని అనుచరులతో చీరాలలో ఇటీవల వ్యూహం రచించినట్లు సమాచారం తనకు అందిందన్నారు. ఈ విషయమై జిల్లా ఎస్పీని కలిసి ఫిర్యాదు చేశానని, తనపై జరిగే ఎటువంటి హానికైనా వైసీపీ నాయకులైన అశోక్‌బాబు, అమృతపాణి, మాజీ మంత్రి నాగార్జునలే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. విచారణ జరిపించి తగు చర్యలు తీసుకుంటానని జిల్లా ఎస్పీ హామీనిచ్చారని ఆయన తెలిపారు. వైసీపీ నాయకులు బెదిరించి, భయపెట్టే ప్రయత్నాల వలన ఎటువంటి ఉపయోగం ఉండదని టీడీపీలో తన క్రియాశీలక పాత్ర ఏమాత్రం తగ్గదని, భయపడే ప్రసక్తి లేదని సాయిబాబా స్పష్టం చేశారు.

వెదసాగు భూమిలో నీటి నిల్వలు లేకుండా చూడాలి

చెరుకుపల్లి, జూలై 16 : వెద సాగు చేసిన రైతుల పంట పొలాల్లో వర్షపు నీరు లేకుండా చూసుకోవాలని జిల్లా వనరుల కేంద్రం డీడీఏ విజయనిర్మల అన్నారు. మండలంలో ఆరుంబాక, ఆరేపల్లిలోని వెదసాగు, జీలుగుపైరు వేసిన రైతులు పంట పొలాలను మంగళవారం ఆమె పరిశీలించారు. అనంతరం ఆమె రైతులతో మాట్లాడుతూ జీలుగు పైరు వేసిన రైతులు 20 నుంచి 30 రోజులకు లేదా 50 శాతం పూతదశలో ఉన్నప్పుడు నేలలో కలియదున్నాలన్నారు. కలియదున్నితే భూసారం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త రాధాకృష్ణ, ఏడీఏ రత్నకుమారి, వ్యవసాయ అధికారి టి.బాలాజీగంగాధర్, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.


వెద సాగు చేసిన పొలాలను పరిశీలిస్తున్న జిల్లా వనరుల కేంద్రం డీడీఏ విజయనిర్మల తదితరులు

వర్షంతో నీట మునిగిన పంట పొలాలు

రేపల్లె, జూలై 16 : తీరప్రాంతంలో ఎడతెరిపిలేకుండా రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా నారుమడులు వెదపెట్టిన పంట పొలాలు నీట మునిగాయి. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. వర్షం కారణంగా పంట పొలాల్లో నీరుచేరటంతో రైతులు నీటిని బయటకు పంపే పనిలో నిమగ్నమయ్యారు. ఇప్పటికే ఎకరాకు రూ.3 వేలు చొప్పున విత్తనాలు చిమ్ముకోవటం జరిగిందని, వర్షం దాటికి ఒక్క చోటకి చేరి మొలకలు తిరగబడిపోయి నష్టం వాటిల్లే పరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికే వందలాది ఎకరాల్లో పంట పొలాల్లో విత్తనాలు చల్లుకుని రైతన్నలు వరినారు మడులు వెద పద్ధతిలో సాగు చేసుకున్నారు. వర్షంతో నష్టపోయిన పరిస్థితి నెలకొందంటూ ఆందోళన చెందుతున్నారు.


కూచినపూడిలో నీటమునిగిన పొలంలో నీటిని తోడుతున్న రైతు

యజమానితో సంబంధం లేకుండా కౌలు కార్డులు అందించాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శి గంగయ్య

భట్టిప్రోలు, జూలై 16 : భూ యజమానితో సంబంధం లేకుండా ప్రభుత్వమే నేరుగా గ్రామ సభల ద్వారా కౌలు రైతులకు కౌలు కార్డులు అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య డిమాండ్ చేశారు. స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కౌలు కార్డుల జారీలో ఉన్న నిబంధనలను సడలించి కౌలు రైతులకు వ్యవసాయంలో భరోసాను కల్పించాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రైతాంగం వరి సాగుకు సన్నద్ధం అవుతున్నందున పంట కాలువలు, మురుగు కాలువలకు తక్షణమే మరమ్మతులు నిర్వహించాలన్నారు. వైసీపీ ప్రభుత్వం కౌలు కార్డు ఇవ్వడానికి భూ యజమాని సంతకం ఉండాలనే నిబంధన పెట్టడం వలన కౌలు రైతాంగం ప్రభుత్వం అందించే సహాయ సహకారాలు అందుకోలేకపోతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం నిబంధనలను సడలించి కౌలు రైతాంగానికి కార్డులను అందించాలని గంగయ్య కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు టి.కృష్ణమోహన్, మండల కమిటీ సభ్యులు మురుగుడు సత్యనారాయణ, గోళ్ళ నాగరాజు, పి.మనోజ్, కె.రామస్వామి, డి.సత్యనారాయణ, పి.ఆరోను పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి కొల్లూరు విద్యార్థిని ఎంపిక

కొల్లూరు, జూలై 16 : ట్రిపుల్ ఐటీకి తమ పాఠశాల విద్యార్థిని ఎంపికైనట్లు జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల హెచ్‌ఎం సీహెచ్ ఉషాకుమారి మంగళవారం తెలిపారు. గత విద్యా సంవత్సరం నిర్వహించిన పదో తరగతి పరీక్షా ఫలితాలలో 600 మార్కులకుగాను 588 మార్కులు సాధించి ప్రభుత్వ పాఠశాలల్లో జిల్లా వ్యాప్తంగా రెండో స్థానం, మండలంలో ప్రథమ స్థానం పొందిన కొలకలూరు ప్రేమకీర్తన నూజివీడు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు చెప్పారు. పాఠశాలతో పాటు గ్రామం, మండలానికి పేరు తెచ్చిన విద్యార్థినిని అభినందిస్తూ ఉన్నత శిఖరాలు అధిరోహించాలని విద్యాశాఖాధికారులు వెంకటేశ్వర్లు, వి.జ్యోతి అన్నారు. హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయినీలు హర్షం వ్యక్తం చేశారు.


ప్రేమకీర్తన

చేప పిల్లల పెంపకం అస్తవ్యస్తం

» చిట్టడవిని తలపిస్తున్న చక్రాయపాలెం కేంద్రం
» శిథిలావస్థకు చేరి ఒడ్డు విరిగి పడ్డ ఊటబావి
» గత ఏడాది నిరుపయోగం


చక్రాయపాలెం వద్ద చిల్లచెట్ల మధ్య ఉన్న చేప పిల్లల పెంపక కేంద్రం.. చేపపిల్లలను పెంచే తొట్టెలు

అద్దంకి, జూలై 16 : జాలర్ల జీవనోపాధి పెంచేందుకు ప్రభుత్వ పలు రకాల పథకాల ద్వారా తోడ్పాటును అందిస్తున్నా నిర్వహణలో మాత్రం నిర్లక్ష్యం వహిస్తుండడంతో ఫలాలు లబ్ధిదారులకు అందడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో జాలర్లకు సబ్సిడీపై వలలు, మో పెడ్‌లు, ఆటోలు అందజేశారు. అయితే గత 5 సంవత్సరాల కాలంలో జాలర్ల పట్ల వైసీపీ పాలకులు పూర్తి నిర్లక్ష్యం వహించారన్న విమర్శలు ఉన్నాయి. ప్రస్తుతం టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో జాలర్లలో ఒకింత ఆశలు చిగురిస్తున్నాయి. అయితే క్షేత్ర స్థాయిలో పరిస్థితులలో మార్పు రాకపోవటం జాలర్లలో ఆందోళన కలిగిస్తుంది. అద్దంకి నియోజకవర్గంలో భవనాసి చెరువుతో పాటు పలు చెరువులలో చేపల పెంపకం జరుగుతోంది. అదే సమయంలో గుం డ్లకమ్మ రిజర్వాయర్ ఆధారంగా కూడా సుమారు 2వేల మంది జాలర్లు చేపల వేట సాగిస్తున్నారు. గుం డ్లకమ్మ రిజర్వాయర్, చేపల చెరువులలో చేప పిల్లలను వదిలేందుకు అవసరమైన చేప పిల్లల ఉత్పత్తి కోసం అద్దంకి మండలం చక్రాయపాలెం సమీపంలో భవనాసి చెరువు అలుగు ఒడ్డున 4 దశాబ్దాల కిందట చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని ప్రారంభించారు. అప్పట్లో నిర్లక్ష్యానికి గురై పూర్తిగా శిథిలావస్థకు చేరి నిరుపయోగంగా మారింది. గత 5 సంవత్సరాల కిందట పునర్‌నిర్మాణం చేశారు. ప్రస్తుతం కూడా అదే నిర్లక్ష్యం కొనసాగుతుండడంతో మరలా శిథిలావస్థకు చేరి మూత పడుతుందేమోనన్న ఆందోళన జాలర్లలో నెలకొంది. సాధారణంగా వేరే ప్రాంతాల నుంచి చిన్న సైజు చేప పిల్లలను తీసుకువచ్చి చక్రాయపాలెం చేపల పెంపకం కేంద్రంలోని నీటి తొట్టెలలో జూలై, ఆగస్టులో చిన్న పిల్లలు తెచ్చి పోసి సుమారు 3 నెలల పాటు పెంచి సెప్టెంబరు, అక్టోబర్‌లో గుండ్లకమ్మ రిజర్వాయర్‌తో పాటు పలు చేపల చెరువులలో పిల్లలను వదిలేందుకు ఇవ్వాల్సి ఉంది. అయితే ఈ కేంద్రంలో చేప పిల్లల పెంపకం విషయంలో నిర్లక్ష్యం కొనసాగుతుందన్న విమర్శలు వస్తున్నాయి. గత నాలుగైదు సంవత్సరాలుగా మొక్కుబడిగా నిర్వహించగా, గత ఏడాది మాత్రం అసలు చేప పిల్లల పెంపకమే చేపట్టకపోవడం మరింత విమర్శలకు తావిస్తుంది. గుండ్లకమ్మ రిజర్వాయర్ గేట్లు కొట్టుకుపోయి నీరు నిల్వ ఉండే అవకాశం లేదు కనుక చేప పిల్లలను వదిలే అవకాశం లేదు. అయితే భవనాసి చెరువుతో పాటు పలు చెరువులలో గత ఏడాది చేపల పెంపకం జరిగింది. చ క్రాయపాలెం చేప పిల్లల పెంపక కేంద్రం ఈ ఏడాది కూడా చేప పిల్లల పెంపకం చేపడతారా లేదా అన్న మీమాంస కొనసాగుతుంది. దీనికి తోడు చేప పిల్లల పెంపక కేంద్రం ఆవరణ మొత్తం చిట్టడవిని తలపించేలా ఉండడం, ఆవరణలో విచ్చలవిడి గా మద్యం బాటిళ్లు ఉండడం పరిశీలిస్తే నిర్వహణ ఎలా ఉందో ఇట్టే అర్థమవుతుంది. అదే సమయంలో చేప పిల్లల పెంపక కేంద్రం తొట్టెలకు నీటిని అందించే ఊట బావి పూర్తిగా శిథిలావస్థకు చేరింది. ఒడ్డు విరిగి పడిపోయింది. కనీసం మరమ్మతులు చేసే విధంగా కూడా అధికారులు ఆలోచించకపోవడం మరింత విమర్శలకు తావిస్తుంది. గత ఏడాది ఎలాగు చేప పిల్లల పెంప కం చేపట్టక పోగా కనీసం ఈ ఏడాది కూడా చేప పిల్లల పెంపకం చేపట్టే విధంగా ఇంకా అడుగులు వేయకపోవడం అనుమానాలకు తావిస్తుంది. అందుబాటులో చేప పిల్లలు పెంపక కేం ద్రంలో పిల్లల పెంపకం చేయకపోవడంతో జాలర్లు సుదూర ప్రాంతం నుంచి ఎక్కువ రేటు కు కొనుగోలు చేసి, అధిక వ్యయ ప్రయాసలకు ఓర్చి తెచ్చుకోవాల్సి వస్తుందని జాలర్లు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చక్రాయపాలెం చేప పిల్లల పెంపకం కేంద్రాన్ని వినియోగంలోకి తెచ్చే విధంగా చర్యలు చేపట్టాలని జాలర్లు కోరుతున్నారు.


ఒడ్డు విరిగి పడి ఉన్న ఊటబావి



నేడు రామకూరు కొండపై తొలి ఏకాదశి తిరునాళ్ల

పంగులూరు, జూలై 16 : మండలంలోని రామకూరు కొండపై కొలువుదీరిన రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద బుధవారం తొలి ఏకాదశి తిరునాళ్ల మహోత్సవానికి తగిన ఏర్పాట్లు జరిగాయి. ప్రతి ఏటా ఎంతో వైభవోపేతంగా జరిగే తొలి ఏకాదశి తిరునాళ్ల మహోత్సవంలో రామకూరు పరిసర ప్రాంత ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి వారికి పూజలు నిర్వహిస్తారు. కొండమీద ఉన్న శ్రీ రామలింగేశ్వరస్వామి దివ్య సన్నిధానంలో బుధవారం ఉదయం 5 గంటలకు ఆలయ గిరిప్రదక్షిణ, మెట్లపూజ, అనంతరం 11 గంటల 30 నిమిషాలకు స్వామివారికి పంచామృత అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహిస్తారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఆలయమునకు విచ్చేసే వేలాదిమంది భక్తులకు కట్టె పొంగలి, లడ్డు, పులిహోర, మజ్జిగ అల్పాహారంగ అందించేందుకు గ్రామస్థులు ఏర్పాట్లు చేస్తున్నారు.

నేడు మంత్రి సమీక్ష

అద్దంకి, జూలై 16 : మంత్రి గొట్టిపాటి రవికుమార్ బుధవారం అద్దరోడ్డు గెస్ట్‌హౌస్ వద్ద ఉదయం 10-30 గంటలకు సంతమాగులూరు మండలంలోని నాయకులు, కార్యకర్తలతో సమీక్ష నిర్వహించనున్నారు. గ్రామాలవారీ సమస్యలను తెలుసుకోవడంతో పాటు అభివృద్ధి పనులపై చర్చిస్తారు. సమావేశానికి వివిధ శాఖల అధికారులు హాజరుకానున్నారు.


రామానగర్ సమీపంలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

మురుగు కాలువలు లేక అవస్థలు

చీరాల, జూలై 16 : మున్సిపల్ పరిధిలోని శాంతినగర్, రామానగర్ మధ్య వర్షపు నీరు రోడ్డుపై నిలబడటంతో వాహనచోదకులు, పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. డ్రైనేజీ సౌకర్యం లేక చిన్న పాటి జల్లు పడినా ఆ ప్రాంతంలో రోడ్డు చెరువును తలపిస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ ప్రాంతంలో వర్షం కురిసి మూడు రోజులు అయింది. నేటికీ అక్కడ రోడ్డు తటాకాన్ని తలపిస్తోంది. దీంతో భారీ వాహనాలు ఆరోడ్డు వెంట వెళ్లేప్పుడు నీళ్ల చింది డివైడర్ దాటి రెండో వైపు రోడ్డులో వెళ్లేవారిపై కూడా పడుతున్నాయి. ఇక పాదచారుల ఇక్కట్లు చెప్పేవి కావు. ఆ ప్రాంతంలో కొందరు ఇళ్లలో నుంచి వెలుపలకు రావాలంటే నిలిచిన వర్షపునీటిలో రావాల్సిందే. ఈ నేపథ్యంలో పాలకులు, అధికారులు స్పందించి డ్రైనేజీ సౌకర్యం ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంతవాసులు కోరుతున్నారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణపై ఫిర్యాదు

మార్టూరు, జూలై 16 : మార్టూరు పోలీస్ స్టేషన్ సమీపంలో రెండు ఎకరాలు ప్రభుత్వ భూమిని ఒక వ్యక్తి ఆక్రమించారని ఏఐకేకేఎస్ నాయకులు మహమ్మద్ బాషా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన స్పందించి ఆర్‌డీవోకు విచారణ చేయాలని ఆదేశించినట్లు తెలిసింది.

రైతుల సమస్యలు పరిష్కరించాలి

మార్టూరు, జూలై 16 : రైతుల సమస్యలపై ప్రజాసంఘాల కార్యాలయంలో మంగళవారం రైతు సంఘాల నాయకులు సమావేశమయ్యారు. పేర్ని నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సాగర్ కాల్వలు మరమ్మతు చేయాలని, మట్టి పేరుకొనిపోవడంతోపాటు ముళ్లచెట్లుపెరిగి నీటి ప్రవాహం ముందుకుపారడం లేదని నాయకులు అన్నారు. కూరగాయల మార్కెట్‌లో కోల్డ్‌స్టోరేజీ నిర్మాణం చేపట్టాలని, గన్నవరం రోడ్‌లో వ్యవసాయశాఖకు చెందిన స్థలం ఆక్రమణలకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని, సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని రైతు సంఘం మండల అడ్‌హక్ కమిటీ ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. సమావేశంలో రైతు సంఘం నాయకులు కందిమళ్ల రామకోటేశ్వరరావు, వీరవల్లి కృష్ణమూర్తి,శేషాద్రి, మోహనరావు పాల్గొన్నారు.

21న ఉచిత మెగా వైద్య శిబిరం

చినగంజాం, జూలై 16 : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 21వ తేదీన ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు డాక్టర్ భరత్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే ఏలూరి, ఒంగోలు ఆస్టర్ రమేష్ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే ఏలూరి సూచనల మేరకు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శిబిరం ఉంటుందని, పేదలు వినియోగించుకోవాలని కోరారు. గుండె వైద్య నిపుణులు, మెదడు, నరాలు, జనరల్, ఊపిరితిత్తులు, ఆర్థోపెడిక్ వైద్య నిపుణులు పరీక్షలు చేస్తారని డాక్టర్ భరత్ తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి


విజయకుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న మీటర్ రీడర్స్

ఇంకొల్లు, జూలై 16 : సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేయాలని కరెంటు మీటర్ రీడర్స్ జనసేనపార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెదపూడి విజయకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లా మీటర్ రీడర్స్ అధ్యక్షుడు కె.రత్నరాజు, జిల్లా ప్రధానకార్యదర్శి కుంచాల సిద్దయ్య, జిల్లా కోశాధికారి సాజిద్దు, వర్కింగ్ ప్రెసిడెంట్ అనిల్‌కుమార్ విజయకుమార్‌ను కలిసి సమస్యలు వివరించారు. ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దృష్టికి సమస్యలు తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని విజయకుమార్ మీటర్ రీడర్స్‌కు హామీ ఇచ్చారు.

'పొలం పిలుస్తుంది'ని విజయవంతం చేయాలి

పర్చూరు, జూలై 1: పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏడీఏ ఎస్.మోహనరావు కోరారు. మంగళవారం రైతు భరోసా కేంద్రంలో పర్చూరు వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని ఆయా మండలాల ఆర్‌ఎస్‌కే, వీఏఏ, వీహెచ్‌ఏ, ఎంపీఈవోలతో ఈనెల 23 నుంచి ప్రారంభం కానున్న పొలంపిలుస్తుంది కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ, ఉద్యాన శాఖ, శాస్త్రవేత్తలు పాల్గొని రైతులకు సూచనలు ఇవ్వాలన్నారు. అనంతరం క్రాప్ ఇన్సూరెన్స్, పీఎం కిసాన్ గురించి వివరించారు. సమావేశంలో పర్చూరు, కారంచేడు, యద్దనూడి ఇంకొల్లు మండలాలకు చెందిన ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇంకొల్లులో నేత్రదానం

ఇంకొల్లు, జూలై 16 : ఇంకొల్లులో మంగళవారం నేత్రదానం జరిగింది. గ్రామానికి చెందిన వంకాయలపాటి ఆదినారాయణ మృతి చెందగా, ఇంకొల్లు రోటరీ అవయవదాన కమిటీ ఆధ్వర్యంలో గుంటూరు శంకర్ ఆసుపత్రి వైద్యులు నేత్రాలు సేకరించారు. నేత్రదానానికి సహకరించిన కుటుంబసభ్యులు శేషయ్య, నాగపూర్ణిమ, శాంతకుమారి, ఆదిత్య, చందనను కమిటీ సభ్యులు సోమేపల్లి రామ్మోహనరావు, జెట్టి స్వామి క్లబ్ అధ్యక్షకార్యదర్శులు రఫి, సాంబశివరావు అభినందించారు.

ముందు రిక్వెస్ట్..తర్వాత పనిష్మెంటే..!

» ప్రజల పక్షాన ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి పనిచేయాలి » మున్సిపల్ సమీక్షలో ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, జూలై 16 : ప్రజాప్రతినిధులైనా, అధికారులైనా ప్రజల పక్షాన, జవాబుదారీగా పనిచేయాలని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం మున్సిపల్ కమిషనర్ చక్రవర్తి, ఇతర అధికారులు, వార్డు సెక్రటరీలతో పలువురు కౌన్సిలర్లతో కలసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముందుగా అందరికీ రిక్వెస్ట్‌గా చెప్తా.. వినకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

గతంలో ఏం జరిగిందో అనవసరమని, ఇకపై అంకితభావంతో అందరం పనిచేయాలని కోరారు. పట్టణంలో పారిశుద్ధ్యం మెరుగుపడాలని, స్వీపర్ నుంచి కమిషనర్ వరకూ కలిసి పనిచేయాలని సూచించారు. వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గతంలో ఉన్న కమిషనర్, కొందరు ఉద్యోగులు ఏకపక్షంగా వ్యవహరిస్తూ మా ఫెక్సీలు కూడా తొలగించారని గుర్తు చేశారు. కాలం ఎప్పుడు ఒకే మాదిరిగా ఉండదని అప్పుడే వారికి సున్నితంగా చెప్పానన్నారు. ముందుందు అందరూ బాధ్యతతో పనిచేస్తారని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. కొండయ్యను అధికారులు, సిబ్బంది సత్కరించారు. కార్యక్రమంలో పలువురు కౌన్సిలర్లు, అధికారులు, వార్డు సెక్రటరీలు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

సమష్టి కృషితో సత్ఫలితాలు

జనసే, బీజేపీ ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, జూలై 16 : సమష్టి కృషి.. సత్ఫలితాలు సాధించడమే ధ్యేయంగా అడుగులు వేద్దామని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య పిలుపునిచ్చారు. రోటరీ కమ్యూనిటీ హాలులో మంగళవారం బీజేపీ, జనసేన పార్టీల ఆత్మీయ సమావేశానికి ఎమ్మెల్యే కొండయ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా జనసేన పార్టీ సెంట్రల్ ఆంధ్రా నేత ఆలా అనిల్, బీజేపీ నాయకులు, ప్రముఖ న్యాయవాది బండారుపల్లి హేమంత్‌కుమార్, మువ్వల వెంకటరమణారావు తదితరులు కొండయ్యకు పుష్పగుచ్ఛాలిచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కొండయ్య మాట్లాడుతూ అభివృద్ధిలో రాజకీయాలు చూడొద్దు. ఆపన్నులకు అండగా ఉందాం. ప్రశాంత వాతావరణం, ప్రజలకు మెరుగైన సేవలందించడంలో నిరంతరం మనకు మనమే పోటీగా ఉందామని స్పష్టం చేశారు. ప్రధానంగా నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తామన్నారు. పలువురు తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యలపై స్పందిస్తూ ప్రాధాన్యతాక్రమంలో అన్ని సమస్యలు పరిష్కరించుకుందామన్నారు. అనంతరం ఎమ్మెల్యే కొండయ్యను ఘనంగా సత్కరించారు. ముందుగా జరిగిన చిన్నారుల నృత్యప్రదర్శన అందరికీ ఆకట్టుకుంది. వారికి ఎమ్మెల్యే కొండయ్య జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందిస్తున్న రోటరీ సభ్యులు

తల్లి ఆరోగ్యంతోనే బిడ్డ సురక్షితం

అద్దంకిటౌన్, జూలై 16 : తల్లి ఆరోగ్యంగా ఉంటేనే పుట్టబోయే బిడ్డ సురక్షితంగా ఉంటుందని, గర్భిణులు మంచి ఆహారం తీసుకోవాలని డాక్టర్ గొట్టిపాటి జయసింహ అన్నారు. మంగళవారం రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో మలాది శ్రీనివాస రావు సౌజన్యంతో స్థానిక గాజులపాలెంలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద మాతాశిశు ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం రోటరీ క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ జయసింహ మాట్లాడుతు గర్భినులు క్రమం తప్పకుండా వైద్యుని సలహాలు, ఆరోగ్య సిబ్బంది సూచనలు పాటిస్తూ మందులను తీసుకోవాలన్నారు. రోటరీ క్లబ్ సేవలను సద్వినియోగపర్చుకోవాలన్నారు. ఈ సందర్భంగా 40 మంది గర్భిణులకు పౌష్టికాహార ప్యాకెట్‌లను అందజేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సెక్రటరీ సీహెచ్ మురళీ సుధాకరరావు, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, అసిస్టెంట్ గవర్నర్ షేక్ మహమ్మద్ రఫీ, సందిరెడ్డి శ్రీనివాసరావు, లేవి ప్రసాద్, నర్రా శ్రీలక్ష్మి, డాక్టర్ దేవపాలన, రామకోటేశ్వరరావు, శ్రీరామ చంద్రమూర్తి, కొల్లా భువనేశ్వరి పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతో మెలగాలి



మాట్లాడుతున్న న్యాయవాది షేక్ మహమ్మద్ రఫీ

అద్దంకిటౌన్, జూలై 16 : ప్రజలు, విద్యార్థులందరూ చట్టాలపై అవగాహన కలిగి సత్ప్రవర్తనతో మెలగాలని న్యాయవాదులు షేక్ మహమ్మద్ రఫీ, గొట్టిపాటి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం అంతర్జాతీయ లా దినోత్సవం సందర్భంగా స్థానిక కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ, రోటరీ క్లబ్ ఆఫ్ మార్టూరు ఆధ్వర్యంలో విద్యార్థులకు సివిల్, క్రిమినల్ చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సివిల్ చట్టాలపై న్యాయవాది గొట్టిపాటి శ్రీనివాసరావు, క్రిమినల్ చట్టాలపై షేక్ మహమ్మద్ రఫీ అవగాహన కల్పించారు. న్యాయవ్యవస్థ ప్రజలందరికీ సమ న్యాయం అందిస్తుందని, చట్టం ముందు అందరూ సమానమన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, మద్దుమాల కోటేశ్వరరావు, మార్టూరు రోటరీ సెక్రటరీ సాంబశివరావు, వైస్ ప్రిన్సిపాల్ హనుమంతరావు, లేవి ప్రసాద్, అధ్యాపకులు అశోక్ కుమార్, శిఖామణి, దాస్, ప్రసాద్ పాల్గొన్నారు.

భవిష్యత్‌లో పొంచి ఉన్న కేన్సర్ ముప్పు

చినగంజాం, జూలై 16 : భవిష్యత్‌లో కరోనా కన్నా ఎక్కువ మంది కేన్సర్ బాధితులు పెరగనున్నట్లు చీరాల ఎల్ఐసీ బ్రాంచి మేనేజర్ జి.రమేష్‌బాబు అన్నారు. స్థానిక ఎల్ఐసీ లైఫ్ ఫ్లస్ కార్యాలయంలో ఎల్ఐసీ అభివృద్ధి అధికారి జి.శ్రీరామచంద్రమూర్తి ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. ప్రభుత్వం త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే కేన్సర్ పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని మేనేజర్ కోరారు. వైద్య ఖర్చులు తట్టుకోవాలంటే కేన్సర్ కవర్ బీమా పాలసీని ప్రతి ఒక్కరూ తీసుకోవాలన్నారు. అంబేడ్కర్‌నగర్‌కు చెందిన ఏజెంట్ దార్ల శ్రీనివాసరావు భార్య సత్యవేదం ఇటీవల కేన్సర్‌తో మృతి చెందగా ఆ కుటుంబానికి శ్రీరామచంద్రమూర్తి ఆధ్వర్యంలో జీఆర్ సంవృద్ధి జట్టు సేకరించిన రూ.5,500ను ఎల్ఐసీ మేనేజర్ అందజేశారు.


పుస్తకావిష్కరణలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

క్లాస్ రూం కథలు పుస్తకావిష్కరణ

ఇంకొల్లు, జూలై 16 : ఇంకొల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి డాక్టర్ కందేపి రాణీప్రసాద్ రచించిన క్లాస్‌రూం కథలు బాలల కథా సంపుటిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కే శ్రీనివాసరావు మంగళవారం ఆవిష్కరించారు. మొత్తం 60 పుస్తకాలు రచించగా క్లాస్‌రూం కథల రచనకు తెలంగాణ ప్రభుత్వం నుంచి ఉత్తమ పురస్కారం అందినట్లు రచయిత రాణీప్రసాద్ తెలిపారు. అనంతరం రాణీప్రసాద్ దంపతులను డాక్టర్ కందేపి ప్రసాదరావు, సునీల్, శ్యాం, ఉపాధ్యాయ సిబ్బంది, కుటుంబ సభ్యులు అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అద్దంకి, జూలై 16 : అద్దంకి పట్టణంలో కొత్త విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు, విద్యుత్ లైన్‌లు వేస్తున్న నేపథ్యంలో బుధవారం ఉదయం 8గంటల నుంచి టెలిఫోన్ ఎక్చేంజీ, నాగులపాడు రోడ్డు, 12, 4వ వార్డులో కరెంట్ ఉండదని ఏఈ శివప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.


అనిల్‌కు వినతిపత్రం అందిస్తున్న జనసేన పార్టీ కార్యకర్తలు

శ్మశానవాటికకు ప్రహరీని నిర్మించాలి

జనసేన పార్టీ సెంట్రల్ ఆంధ్రా ప్రోగ్రాం కన్వీనర్‌కు వినతి

చీరాల, జూలై 16 : వేటపాలెం మండలం దేశాయిపేట పంచాయతీ మంకెనవారిపాలెంలోని శ్మశాన వాటిక ఆక్రమణలకు గురికాకుండా ప్రహరీ గోడను నిర్మించాలని జనసేన పార్టీ కార్యకర్తలు ఆ పార్టీ సెంట్రల్ ఆంధ్రా ప్రోగ్రామ్ కన్వీనర్ ఆలా అనిల్‌కు వినతిపత్రం అంజేశారు. జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదుకు సంబంధించి చీరాల నియోజవకర్గ పరిశీలకునిగా వచ్చిన ఆలా అనిల్‌కు వారు సమస్యలు వివరించారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య దృష్టికి సమస్యను తీసుకెళ్లి కచ్చితంగా తగిన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్యకర్తలు ఆర్‌కే నాయుడు, నూతక్కి రాజేష్, పసుపులేటి సాయి, తోట అశోక్‌చక్రవర్తి పాల్గొన్నారు.

రోడ్డుపైనే మురుగు నీరు

» నడవలేక ఇబ్బంది పడుతున్న ప్రజలు
» పేరుకుపోతున్న చెత్తాచెదారం
» దోమల ఉత్పత్తి కేంద్రాలుగా ప్రాంతాలు


రోడ్డుపై మురుగునీరు

మేదరమెట్ల , జూలై 16 : సైడు కాలువలు లేక మురుగునీరు రోడ్లపై పారుతోంది. పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, వివిధ పనులపై బయటకు వచ్చే గృహిణిలు, కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులు, కూలీలు, రైతులు మురుగు నీటిలో నడవలేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. మేదరమెట్ల పేరుకు మేజరు పంచాయతీయేగాని కనీస సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా రోడ్లు, మురుగు కాలువలు, సాయంత్ర సమయంలో కాసేపు కూర్చొనేందుకు పార్కు వంటి సరైన సౌకర్యాలు లేవు. రోడ్ల వెంబడి వేసిన చెత్త చెదారాన్ని తొలగించడానికి మూడు నాలుగు రోజులు పడుతుంది. దీంతో రోడ్లపై చెత్తను కుక్కలు, పందులు చెల్లాచెదురుగా చేస్తున్నాయి. దానిని నుంచి వచ్చే కంపును భరించలేని పరిస్థితి ఉంది. మిద్దెలడొంకలో సీసీ రోడ్డు నిర్మించిన ఆది మెటల్ రోడ్డు కన్నా దారుణంగా గోతులతో ఉంది. ఈ రోడ్డు నిర్మాణ సమయంలోనే అధ్వానంగా నిర్మించడంతో ఇది కొత్తగా నిర్మించిన సీసీ రోడ్డా.. మెటల్ రోడ్డా అన్న అనుమానం వస్తోంది. ఈ రోడ్డుకు ఇరువైపులా మురుగు కాలువలు లేకపోవడంతో ఎక్కడికి అక్కడ మురుగునీరు నిలిచి ఆ మురుగునీరు రోడ్లపై నిలుస్తుంది. ఎక్కువగా మురుగునీరు నిల్వ ఉండడంతో దోమలు ఉత్పత్తి కేంద్రాలుగా మారాయి. కనీసం మురుగు నీరు పారే విధంగా చర్యలు చేపట్టక పోవడంతో ప్లాస్టిక్ వ్యర్థాలు, ఇతర చెత్తతో ఎక్కడికి అక్కడ నీరు నిలిచి పోతుంది. గ్రామంలో ఎక్కువ శాతం సిమెంట్ రోడ్లు నిర్మించిన నాణ్యాతతో నిర్మించకపోవడం వలన రోడ్లపైనే నీరు నిలువ ఉంటుంది. చాలా రోడ్ల వెంట మురుగు కాలువలు నిర్మించకపోవడం వలన మురుగునీరు రోడ్లపైనే పారుతోంది. వర్షాకాలం వస్తున్నందున్న పంచాయతీ అధికారులు మురుగుకాలువలు నిర్మించాలని, కాలువల్లో మురుగు పారేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. మిద్దెలడొంక సిమెంట్ రోడ్డును బాగు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

గంగపుత్రుల గొంతెండుతోంది..!

» గోడు పట్టించుకోవాలని గగ్గోలు
» సమస్యలపై అధికారుల నిర్లక్ష్యం

వాడరేవు (చీరాలటౌన్), జూలై 16 : చీరాల పరిధిలో పర్యాటక కేంద్రమైన వాడరేవు గ్రామంలోని గంగపుత్రులకు తాగునీరు లేక గొంతెండుతోంది. గ్రామంలో సుమారు 3వేలకు పైగా మత్స్యకార కుటుంబాలు నివాసమున్నాయి. సముద్రతీర ప్రాంతం కావడంతో ఈ ప్రాంత వాసులకు తాగునీరు అందని ద్రాక్షగానే ఉంది. ఇదిలా ఉంటే పంచాయతీ అధికారులు గ్రామంలో ఆర్వో ప్లాంటును ఏర్పాటు చేశారు. కొద్దికాలం అరకొరగానే నడిచింది. గత నాలుగు మాసాలుగా పూర్తిగా మరమ్మతులకు గురై మూలనపడింది. దీంతో ప్రజలు ప్రైవేటు వ్యక్తుల వాహనాల ద్వారా తెచ్చే నీటిపై ఆధారపడ్డారు. ఒక వేళ వారు సకాలంలో రాకపోతే వీరి పరిస్థితి ఊహించలేనిది. అంతేకాకుండా నివాసాల్లోని యువకులు, పురుషులు వేటకు వెళ్లి ఒక్కోసారి వారం రోజుల పాటు సముద్రంలోనే ఉంటారు. ఈసమయంలో ఇంట్లో ఉన్న వృద్ధులు, మహిళలు తాగునీరు కోసం పాట్లు పడుతున్నారు. మరోవైపు గ్రామంలో అధిక శాతం రోడ్లు శిథిలావస్థకు చేరాయి. రోడ్లు గుంతలమయం. పైగా వీధి దీపాలు కూడా పూర్తిగా లేవు. ఈక్రమంలో రాత్రి సమయాల్లో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పారిశుధ్య లోపం మెండుగానే ఉంది. చెత్త సేకరణలో అధికారులకు చిత్తశుద్ధి లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. వీధుల వెంబడి చెత్త పేరుకు పోయి కంపుకొడుతోంది. దీంతో గ్రామస్థులే కాకుండా దూర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులకు కూడా దుర్గంధాలు దర్శనమిస్తున్నాయి. నెలల తరబడి తాగునీరు లేక అవస్థలు పడుతున్నా అధికారులు పట్టించుకోలేకపోవడంపై అనుమానాలు గుప్పిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు మౌలిక వసతులు కల్పించి ఆదరించాలని గ్రామస్థులు వేడుకుంటున్నారు.


మూతపడిన వాడరేవు పంచాయతీ ఆర్వో ప్లాంట్

తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నాం



పంచాయతీకి చెందిన ఆర్వో ప్లాంట్ మూలన పడి నెలలు గడుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఈక్రమంలో తాగేందుకు నీరు లేక గ్రామంలో పెద్ద చిన్న తేడా లేకుండా అందరం చాలా ఇబ్బందులు పడుతున్నాము. అధికారులు గ్రామస్థులకు తాగు నీరు అందించాలి.

- అప్పన్న, స్థానిక మత్స్యకారుడు

సమస్యలను పరిష్కరించాలి



గ్రామంలో రోడ్లు సక్రమంగా లేవు. వీధి దీపాలు అరకొరగానే ఉన్నాయి. పారిశుధ్య లోపం ఉంది. చెత్త సేకరణ సమస్య చాలా ఉంది. ప్రధాన రహదారులు మినహా వీధుల్లోకి కార్మికులు రావడం లేదు. దీంతో గ్రామంలో సమస్యల వలయంగా మారింది. అధికారులు సమస్యలను పరిష్కరించారు.

- రాజేష్, మత్స్యకారుడు